ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 04, 2016

వివిధ దేశాల్లో వినాయకుని రూపాలు





ENTERED
KSR02B136 CE







ఫ్లాప్ అన్నావే..!

రిలీజ్‌కి సిద్ధమైన సినిమాలపై అభిమానుల ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువే. అయితే సినిమా విడుదలైన రోజే గుడ్, యావరేజ్, వేస్ట్ అంటూ సినీ విశ్లేషకులు తేల్చిచెప్పినా కొన్ని చిత్రాల ఆ అంచనాలన్నీ తారుమారుచేశాయి. అమీర్ ఖాన్ నటించిన 'దిల్ చాహ్‌తా హై' ఇంగ్లీష్ మూవీలా వుందంటూ స్క్రిప్టింగ్ విభాగంలో విమర్శలతో పాటు, కొన్ని మెట్రో నగరాల్లోనే ఈ చిత్రం విజయం సాధించగలదనే విమర్శలూ అందాయి. అయితే విడుదలైన కొన్ని రోజులకే ప్రపంచస్థాయి ఖ్యాతి పొందిందీ చిత్రం. 'దేవదాస్' బెంగాలీ నవల ఆధారితంగా బాలీవుడ్‌లో ఘనవిజయం సాధించిన చిత్రం దేవదాస్. ఈ కథాంశానికి కొత్త ఫ్లేవర్‌తో 'దేవ్‌డి' చిత్రాన్ని నిర్మించాడు అనురాగ్ కశ్యప్. ఈ చిత్రం పంజాబ్, ఢిల్లీ ప్రాంతాల్లో తీవ్ర విమర్శలని ఎదుర్కోవడంతో సినిమాపై ఆశలు వదులుకోవచ్చని విమర్శించారు. అలాంటి విమర్శలన్నిటినీ తిప్పికొట్టి హిట్ కొట్టిందీ చిత్రం. లింగ వివక్షని ప్రశ్నించే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రం మసాన్. స్క్రిప్ట్‌తో పాటు ఈ చిత్రం ముగింపు బాలేదంటూ భారీస్థాయిలో రివ్యూలొచ్చినా రిజల్ట్ మాత్రం దానికి భిన్నంగా వచ్చింది. జస్ట్ అనుకున్న 'రాక్‌ఆన్' చిత్రం విజయాన్ని సాధించింది. అమితాబ్ బ్లాక్‌బాస్టర్ చిత్రం షోలే రిలీజైన తొలినాళ్లలో వెస్టన్ సినిమాల తరహాలో ఉందంటూ సినీ పరిశ్రమలో వ్యతిరేకత వక్తపరిచినా తర్వాత సీన్ రివర్స్ అయింది. బాలీవుడ్ చిత్రాలే కాదు ది నోట్ బుక్, ఇన్సెప్షన్, ది డార్క్ నైట్, ది అన్‌యూజ్వల్ సస్పెక్ట్ లాంటి హాలీవుడ్ చిత్రాలకీ నెగటివ్ రివ్యూలే వెలువడినా ప్రేక్షకుల మదిలో ఈ చిత్రాలన్నీ చిరకాలం నిలిచిపోయాయి.









KSR02B136

'లచ్చిందేవికి ఓ లెక్కుంది' చిత్రంలో చేసిన హీరో 'అందాల రాక్షసి'లో చేసిన హీరో ఒక్కడేనా అనేంత వైవిధ్యంగా అనిపిస్తుంది. నవీన్ చంద్ర సినిమా పాత్రలు చూస్తే. తీవ్ర ప్రేమికుడిలా భగ్న హృదయుడిలా కుర్రకారుకి వెర్రి పట్టించిన పాత్రలో అలా ఒదిగిపోయిన నవీన్ చంద్ర ఆ తరహా పాత్రలకే బాగా యాప్ట్ అవుతాడన్నంత స్థాయిలో ఉంటుంది నటన. 'దళం' చిత్రంతో మరో యాంగిల్ చూపించాడు. రెండు పాత్రలు కూడా చాలా రఫ్‌గా ఉంటాయి. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు చాలా క్లాస్ పాత్రల్ని ఇస్తున్నాయి. అయినా మెప్పిస్తానంటున్న నవీన్ లెక్క ఇది.



స్టార్

ఇది నవీన్ లెక్క

నవీన్ చంద్ర కర్నాటకలోని బళ్లారిలో జన్మించాడు. ఈయన నాన్న బళ్లారిలో ఆర్టీసీలో మెకానిక్.

- నవీన్ పెరిగిందంతా హైదరాబాద్ అవడం వల్ల తమిళం కంటే తెలుగు సినిమాల్లోనే మొదట ఆయన రంగ ప్రవేశం జరిగింది.
- చిన్నప్పటి నుంచీ రంగుల ప్రపంచం అంటే పిచ్చి. టీవీల్లో వస్తున్న ప్రతి సీన్‌నూ తనకు తాను టీవీ ముందు కూర్చొని చేసేసేవాడు. యాడ్స్‌ను కూడా వదిలేవాడు కాదంటే సినిమాలన్నా, నటన అన్నా ఎంత పిచ్చో అర్థమయ్యే ఉంటుంది.
- ఈయన మొదటి సారిగా 'సంభవామి యుగే యుగే' అనే చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించాడు. 'కళ్యాణం'లో కూడా నటించాడు కానీ అవి అంతగా గుర్తింపునివ్వలేదు.
- మొదట సారిగా తమిళ చిత్రం 'అగరత్తి' సినిమాలో హీరోగా నటించాడు. రచయిత రాజేష్ కుమార్ రాసిన 'ఇరివిల్ ఒరు వానవిల్' అనే నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'వైభోగం' పేరుతో తెలుగులోనూ విడుదలైంది.
- ఈ చిత్రం విడుదలకు చాలా కాలం పట్టింది. ఈ సినిమా తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెలుగులో 'అందాలరాక్షసి' చిత్రంలో చేసే అవకాశం ఇచ్చాడు. అందులో సూర్య పాత్రలో నవీన్ చంద్ర తన నటనతో మెప్పించాడు. అందుకే మంచి మార్కులే పడ్డాయి. తర్వాత అవకాశాలు కూడా పెరిగాయి.



- తర్వాత సంవత్సరం రామ్ గోపాల్ వర్మ అసిస్టెంట్ ఎం.జీవన్ దర్శకత్వంలో నక్సలిజం నేపథ్యంలో 'దళం', తమిళంలో 'కూట్టామ్'పేరుతో వచ్చిన సినిమాలో చేశాడు. ఈ తరహా పాత్రలు కూడా చేయగలడని నిరూపించుకున్నాడు.
- శశికుమార్, లావణ్యత్రిపాఠితో కలసి బ్రమ్మన్‌లో చేశాడు. 2014లో ఏకంగా తమిళంలో నాలుగు, తెలుగులో రెండు చిత్రాల్లో చేశాడు.
- తెలుగులో చేసిన 'నా రాకుమారుడు' నిరాశ పరిచింది. నవదీప్‌తో కలసి చేసిన 'భమ్ బోలేనాథ్' మాత్రం కాస్త ఊరటనిచ్చింది. ఇంకొక విశేషం ఏమిటంటే ఈ సినిమాలో నవీన్ చంద్ర నటనకు ఐఫా అవార్డుల్లో బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా కూడా పేరు నామినేట్ అయ్యింది.
- స్వాతితో కలసి 'త్రిపుర' అనే హారర్ చిత్రంలో చేశాడు. సినిమాలో ఫలితం ఎలా ఉన్నా నవీన్ చంద్రకు మంచి పేరు తెచ్చిపెట్టింది.
- వెంటనే లావణ్య త్రిపాఠికి జోడీగా 'లచ్చిందేవికి ఓ లెక్కుంది'లో చేశాడు. ఎన్నో అంచనాలతో దర్శకుడు జగదీష్ తలశిల ఈ చిత్రాన్ని రూపొందించినా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది.
- ప్రస్తుతం మరో సినిమా యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రం చేస్తున్నాడు. జి.గోపీ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో పాటు నీవేద థామస్ హీరో హీరోయిన్‌గా అజయ్ వొధిరాల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది.

- కొప్పుశెట్టి దేవరాజు

ENTERED

ఇండెక్స్

సేవ.................3

సర్ప మిత్రులు

జీవితం..............4

ఓ ఆటో డ్రైవర్..ఓ కూతురు..ఓ రైఫిల్

కార్టూన్ పంచ్......... 5

వింత లోకం...........10

డైవింగ్ దాటి డాన్సింగ్

విజేత........11

శిలంబన్ మహిళ

కవిత్వమ్...............14

సామాజిక గుహ

వివిధ దేశాల్లో వినాయక రూపాలు



అట్టమీది కథ...6

సందర్భం - 12

అక్షర కిరణాలు

ప్రత్యేకం....................15

వీధి బిడ్డకు పుట్టినరోజు

కథ 16

'దేవుడు' సచ్చిండు కానీ..!

తెలుసా....................19

ఆత్మీయులై ఆత్మహత్యలాపండి

రుచి....................21

పూర్ణం కుడుములు

బాల నేస్తాలు.............23

హిమాలయన్ స్నోకాక్

పద వికాసం.....

....24

శూన్యంలో అన్ని వసతుల గృహం

అద్భుతమైన స్పేస్ సైన్స్ పాఠాన్ని మా కందించిన ప్రజాశక్తి అనుబంధానికి అభినందనలు. రోదసిలో మానవ నివాసానికి అనువైన గృహనిర్మాణం ఆలోచన రావడం మిరకిల్ ఐడియా. అతి భారీ నిర్మాణం భూమి నుంచి రోదసీలోకి పంపడం అసాధ్యం కనుక చిన్న మాడ్యూల్స్ పంపి అక్కడ అనుసంధాన పర్చడం అద్భుతం. అదే సూత్రాలు అనేక దేశాలు అనుసరించడం, 14 ఏళ్లలో స్పేస్‌స్టేషన్‌కి నిజరూపాన్ని తేవడం సామాన్య విషయం కాదు. 14 ఏళ్లలో కొన్ని వందల ట్రిప్పులు రోదసీలోకి దూసుకుపోవడానికి ఎంతో శ్రమ పట్టుదల కలిగిఉండాలి. ఇంటర్నేషనల్ స్పేస్‌స్టేషన్‌కి 2001 నుంచి ఇప్పటి వరకు 200 మంది సుశిక్షితులైన ఆస్ట్రోనాట్స్ పిహెచ్‌డి డాక్టరేట్లు, ఎమ్.డిలు ఆ గృహానికి వెళ్లి స్పేస్‌లో చక్కర్లు కొట్టి రావడం ఓ మహా అద్భుతం. ఐఎస్‌ఎస్‌కు చేర్చే సూయజ్‌లో 6 గంటలు ప్రయాణానికి టికెట్టు రెండు కోట్ల డాలర్లయినా వెనుకాడని ఎందరో మేధావులున్నారు.

టి.సత్యనారాయణ మూర్తి,
విశాఖపట్నం

ఆయుష్షు పెంచే ఆట స్థలాలు

నా పేరు కార్తి చదివాక మా అభిమాన నటుడు కార్తికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. విజయ్ గారు రాసిన 'భూమి

ఆవల మన ఇల్లు' కథనం చాలా ఇంట్రెస్టింగా ఉంది. 'మన లేడీ కమాండో' సీమారావు చదివాక మా కెంతో ప్రేరణ కలిగింది. 'ఆయుష్షు పెంచే ఆట స్థలాలు' వావ్ అనిపించాయి. ఈ వారం సండే రచనలు సూపర్బ్.

- శ్రీరామ్ సబ్బిశెట్టి,
వేములపాలెం

లేడీ బ్రూస్లీ భేష్

స్నేహ ఆగస్టు 21 సంచికలో 'మన లేడీ కమాండో' శీర్షికన ప్రచురితమయిన కథనం ఆద్యంతం స్ఫూర్తి దాయకంగా ఉంది. ఆమె జీవితాన్ని పరిశీలిస్తే మనో నిబ్బరం, దృఢ సంకల్పం గల ఓ మహిళ ఎంతటి ఆత్మస్థయిర్యంతో ఉన్నత శిఖరాలకి చేరగలదో తేట తెల్లం అవుతుంది. పేరు పెట్టని ఓ యుద్ధ కళని కనిపెట్టి, సామాన్య మహిళలకి ఆమె స్ఫూర్తిని ఇస్తుండడం అభినందనీయం.

జటావల్లభుల సాయిరాం,
కైకరం

చల్ చలో

ఏకబిగిన కొన్ని కి.మీలు నడిచి అలిసిపోయే మారథాన్‌లా కాకుండా నడకతో పాటు ప్రకృతి ప్రేమికులని ఆనందపరిచే మారథాన్‌ల సమాహారం చల్ చలో ఆకట్టుకుంది. భూమి ఆవల మనిల్లు, దులారి కథ, మనలేడీ కమాండో ఆద్యంతం చదివించాయి. ఇన్‌స్టాగ్రాం ఎడ్వర్టైజింగ్ టీమ్‌లో మన తెలుగమ్మాయి సమీరా ఉండడం అభినందనీయం. ప్రపంచయానంలో పదనిసలు, నాపేరు కార్తి, హిందీ చీనీ స్టార్ స్టార్, 'గిన్నిస్'కూ రికార్డుంది, శ్రమజీవితం కవిత, ఒలింపిక్ ప్రేమజంట, కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి.

-హరిప్రియ
విజయవాడ

భూమి ఆవల మనిల్లు

భూమి ఆవల మనిల్లు అట్టమీది కథ చాలా బాగుంది. అయితే ఇంకా కొంత వివరణాత్మకంగా ఎక్కువ సమాచారంతో ఇచ్చి ఉంటే బాగుండేది.

ఖాజ హుస్సేన్
- ఈమెయిల్

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com


సేవ

సర్ప మిత్రులు

అన్నీ విష సర్పాలు కాదని చదువుకుంటాం.. కానీ పాము ఎక్కడైనా కనబడిందా హడలిపోతారు. ధైర్యముంటే కొట్టి చంపేస్తారు. అలాంటి వారికి సర్ప మిత్రుల గురించి చెబితే అదేం స్నేహమని ఆలోచనలో పడతారు. పుట్టలో పాలు పోసేవాళ్లు కాదు వీళ్లు అలా పోసి ఆ మూగ జీవాలకు కష్టం కలిగించొద్దని అవగాహన కల్పించే శాస్త్రీయ స్నేహితులు వీళ్లు. సర్పాలపై అవగాహన కలిగిస్తూ వాటి సంరక్షణ కోసం కృషి చేస్తోన్న వీరి బృందం పేరే 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్'.

అడవులు, కొండలు, గుట్టలు, చెరువులు, తీర ప్రాంతాలు, పొలాల్లో జీవించే పాములు దారితప్పి జనావాసాల్లోకి వస్తాయి. సరిగ్గా చెప్పాలంటే జనావాసాలే దారి తప్పించి వాటి ఆవాసాల్లోకి చొచ్చుకెళతాయి. ఇక అవి ఎదురుపడాల్సిందేగా. మనిషిని పగబట్టి అవి కాటేయవు... భయపడి ఆత్మరక్షణకి తంటాలు పడతాయి. అది తెలీక అటవీ శాఖ సిబ్బంది అందుబాటులో లేక చాలామంది వాటిని చంపేస్తారు. ఇలా అవగాహన లేకుండా వాటిని చంపేయడం వల్ల రోజు రోజుకు వాటి సంఖ్య తగ్గిపోతోంది. జీవ సంతులనం దెబ్బతింటోంది. పాము పేరు కూడా తెలీకపోవడంతో పాటు ఏది కరిచినా విష సర్పమే అనుకుంటారు. ఈ విషయాలపై అవగాహన కల్పించాలని 20 ఏళ్ల కిందటే కసూరి రాజ్‌కుమార్ అనుకున్నారు. హైదరాబాద్‌లో 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ' సంస్థను స్థాపించారు. ప్రారంభంలో ఐదారుగురు మిత్రులున్న ఈ బృందంలో ఇప్పుడు 150 మందికి పైగా సేవలందిస్తున్నారు. ఈ మిత్రుల్లో వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు ఇలా అన్ని రంగాలకు చెందినవారున్నారు. పాముల్ని పట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించే రిస్క్, రిలీజ్ టీమ్‌ల్లో మహిళలూ పనిచేస్తున్నారు. మిత్రుల నివాస ప్రాంతాలను బట్టి రక్షణ బాధ్యతలను పంచుకుంటారు. కొత్తగా చేరే మిత్రులకు సీనియర్లు పాముల్ని పట్టడంలో శిక్షణనిస్తారు. రెండు దశాబ్దాల్లో వీళ్లు కొన్ని వేల పాముల్ని సంరక్షించగలిగారు.

అంతా శాస్త్రీయంగానే..

ఏఏ పాములకు ఏఏ నెలలు అనుకూలంగా ఉంటాయనే విషయంపై వీరికి అవగాహన ఉంది. ఒక్కసారి ఒక చోట పాములను వదిలిన తరువాత మరల ఏడాది వరకు అక్కడ పాములను వదిలిపెట్టరు. ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈ సంస్థ సభ్యులు కొన్ని వేల పాముల్ని పట్టుకున్నారు. పాములను పట్టుకోగానే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిస్తూ వారి సూచనల మేరకు శ్రీశైలం అడవులు, పోచారం వన్య ప్రాణి సంరక్షణ ప్రాంతం, నల్లమల అడవుల్లో సర్పాలను విడిచిపెడతారు. పాములను అడవులకు తరలించే వరకు తాత్కాలిక సంరక్షణ కోసం రెస్క్యూ హోంను ఏర్పాటు చేసుకున్నారు. పాములకు ఆహారాన్ని అందించడమే కాకుండా గాయాలైతే చికిత్స కూడా చేస్తారు.

సినీనటుడు సాయికిరణ్

ఎందుకింత ప్రేమ

ప్రపంచవ్యాప్తంగా 2800 రకాల సర్పజాతులుంటే మన దేశంలో కేవలం 280 రకాలు మాత్రమే ఉన్నాయి. ఎక్కువగా కనిపించే వాటిలో కేవలం నాలుగు రకాలు మాత్రమే విషంతో కూడుకున్నవి. రక్త పింజర, చిన్న పింజర, కట్ల పాము, తాచు పాము మాత్రమే విష సర్పాలు. ఇవి కాటు వేస్తే ప్రాణాపాయం కలుగుతుంది. మిగతా వాటిలో అన్నీ విష సర్పాలు కావు. కానీ ఇవేమీ తెలీక భయంతో పాముల్ని చంపేస్తుంటారు. వన్యప్రాణి ప్రేమికులకు ఈ విషయం కష్టం కలిగించే ఇలా స్వచ్ఛందంగా వాటి సంరక్షణకు ముందుకు వచ్చారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. రిస్క్ వ్యవహారం కావడంతో సభ్యులుగా చేరడం సులభమైన విషయం కాదు. శిక్షణకు ముందు రెండు మూడు వారాల పాటు గమనిస్తారు. పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే సంరక్షణ కేంద్రంలో ఉన్న పాములను చూపిస్తూ వాటి గురించిన పూర్తి వివరాల్ని, పాముల్ని పట్టడంలో శిక్షణనిస్తారు. సినీ నటుడు సాయి కిరణ్ కూడా ఈ సర్ప మిత్రుల్లో ఒకరు. ఏడేళ్లలో మూడు వేల పాముల్ని రక్షించారు. జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్ ప్రాంతాల్లో పాము వచ్చిందని సమాచారం అందిన వెంటనే ఆయన అక్కడ వాలిపోతారు. ఈ ప్రాంతాల్లోని సినీ ప్రముఖుల ఇళ్లలో పాము కనిపిస్తే ఈయనకే కాల్ వస్తుంది. రకరకాల పండుగలు, సందర్భాలపుడు పాముల్ని ఆడించే వారి నుంచి వాటిని రక్షించే బాధ్యతనూ భుజానికెత్తుకుందీ సొసైటీ. పాముల్ని ఆడిస్తే మూడేళ్ళ జైలు శిక్ష, పాతిక వేల రూపాయల జరిమానా ఉందనే విషయం కూడా చాలామందికి తెలీదు. ఎక్కువగా పొట్ట కూటి కోసమే ఈ వృత్తిని ఎంచుకున్న వారిని ప్రత్యామ్నాయాల వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తారు. విష సర్పం కాటేస్తే విరుగుడుగా ఇచ్చే యాంటీ వెనమ్ తయారీలో పాము విషాన్నే వాడతారని, అందుకే విష సర్పాలను ప్రాణాలతో పట్టుకుంటే వాటి నుంచి సేకరించిన విషంతో మందు తయారు చేయొచ్చని వివరిస్తారు. నాటు మందులు, మంత్రాలకు విషం విరుగుడవ్వదని యాంటీ వెనమ్‌నే వాడాలని హితవు చెబుతున్నారు.

- అనంతోజు మోహనకృష్ణ

రాత్రి షిఫ్టు వేస్తే గానీ ఓ వంద పెట్టి కొత్త వస్తువు కొనుక్కోలేని ఓ ఆటో డ్రైవర్ తన కూతురుకు ఖరీదైన, ఎవరూ ఊహించని బహుమతి కొనిచ్చాడు. అందరికీ అది తాహతుకు మించి అందించినట్టే కనిపించినా అదే ఆమె ప్రాణం. అందుకే ఆమె మొహం వెలిగిపోతోంది. ఆ ఇంట్లో అప్పటికే ఉన్న పతకాల వెలుగుకు జోడీ అయ్యి మరింత వెలిగిపోతోంది. ఇంతకీ ఏమిటా గిఫ్ట్? ఎందుకంత ప్రాణం? అక్షరాలా ఐదు లక్షలు ఖరీదు చేసే ఆ బహుమతి ఓ రైఫిల్. షూటింగ్‌లో ఒలింపిక్ బంగారు కలలు కంటున్న ఆ కూతురికది ప్రాణమేగా.

ఓ ఆటో డ్రైవర్.. ఓ కూతురు... ఓ రైఫిల్

మణిలాల్ గోహిల్ ఆటో డ్రైవర్. అహ్మదాబాద్‌లో ఆటో ఎప్పటి నుంచో వేస్తున్నాడు. అతడి జీవిత యాత్ర ఆటో హేండిల్‌ను వదిలేలా లేదు. గోమతిపూర్‌లో నివాసం నుంచి కూతురు మిట్టల్‌ను, ఇద్దరు కొడుకుల్ని అదే ఆటోలో రోజూ స్కూల్‌కు తీసుకెళ్లాడు, కాలేజీలో దింపాడు. భవిష్యత్తులో కూతురిని తన ఇంటికి, అత్తవారింటికి కూడా అదే ఆటోలోనే తిప్పాలేమో అనుకునేవాడు. ఆయన ఆలోచన ఆటు చక్కర్లు కొడుతుంటే కూతురి దృష్టి మాత్రం ఆటో ప్రయాణాల్లో చూపు నుంచి రివ్వున దాటిపోయే ఖానాపూర్ రైఫిల్ షూటింగ్ క్లబ్ మీద నిలిచేది. తండ్రి.. కూతురి పెళ్లి గురించి కలలు కంటుంటే, కూతురు తండ్రికి పేరు తెచ్చేందుకు లక్ష్యాల్ని పెట్టుకునేది. మిట్టల్ ఆర్మీ ఆఫీసర్ కావాలనుకుంది. అందుకోసం పిఎస్ఐ పరీక్ష కూడా రాసింది. అందులో ఉత్తీర్ణురాలైనప్పటికీ, ఎత్తు సరిపోని కారణంగా ఎంపికవ్వలేదు. ఆటో ప్రయాణంలోని కబుర్లలోనే తన లక్ష్యం గురించి మాట పొసిగింది కూతురి నోటి నుంచి. రైఫిల్‌ను చేత పట్టాలని, గొప్ప షూటర్ అవ్వాలని, ఒలింపిక్స్‌లో అడుగు పెట్టాలని, బంగారు పతకం తెచ్చి తండ్రి మెడలో వేయాలని... కూతురి మాటల ప్రవాహంలోని కాంక్ష, కసి, పట్టుదల, తపన ఆటో హోరును దాటి తండ్రి చెవిని బలంగా తాకి మనసులో నాటుకుపోయాయి.

మేగజీన్ లోడైంది

కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్న కొడుకు జైనిష్ అక్కడితో సరిపెట్టుకున్నాడు. కూతురి కల నెరవేర్చలేనని చాలా బాధపడేవాడు. మొదట్లో.. మిట్టల్ ఇష్టాన్ని పెద్దగా పట్టించుకోనట్లు నటించేవాడు. చివరకు ధైర్యం చేశాడు. 2012లో కూతురిని రైఫిల్ క్లబ్‌లో చేర్పించాడు. వాళ్లనూ వీళ్లనూ బతిమాలుకుని ఆ కాసేపు ఓ రైఫిల్ కూతురి చేతికందేలా చేసి శిక్షణ తీసుకునేలా పాకులాడాడు. తొలిరోజుల్లో శిక్షణ రుసుమును రోజూ కొంత చిల్లర రూపంలో అందించేవాడు. కన్న కూతురు కన్న కలలన్నా నిజమై తన కళ్లతో చూడాలనుకున్నాడు. తండ్రి తన కోసం పడుతున్న ఆతృతను చూసిన మిట్టల్‌కు లక్ష్యం ఇంకా స్పష్టంగా కనిపించింది. గురి తప్పలేదు. ఆ రైఫిల్ క్లబ్ దాటి ఆమె తూటా చప్పుడు పలు క్రీడా పోటీల్లో వినిపించింది. ఒక్కో టార్గెట్ చార్ట్ మధ్యకు కోసుకుపోతుంటే మిట్టల్ ప్రతిభ పైపైకి తెలిసింది. జాతీయ పోటీల్లో అవకాశం వచ్చింది. ఆమె రైఫిల్ నుంచి దూసుకొచ్చే ఒక్కో బుల్లెట్ ఉన్న టార్గెట్లను ధ్వంసం చేస్తూ పెద్ద టార్గెట్‌కు చార్ట్ మార్చేశాయి.

తూటా పేలింది

50 మీటర్ల రేంజ్ షూటింగ్‌లో ఓ రేంజ్‌లో ప్రతిభ ఉన్న కూతురికి పాత బాడుగ రైఫిల్ వల్ల సాంకేతిక వెనుకడుగు ఉండకూడదనుకున్నాడు. డే షిఫ్ట్ దాటి అర్ధరాత్రి వరకూ చక్కర్లు కొడితే గానీ కూతురి కలల తీరానికి దగ్గరవదు. నిద్ర గురించి ఆలోచించి చాలా కాలమైంది. ఎందుకంటే నిద్రలో వచ్చేది కాదు కల.. మత్తు నిద్ర వదిలించి లక్ష్యం వైపు పరుగెత్తించేది అని తానూ విన్నాడు. తన కూతురు కల కోసం తానూ పరుగెత్తాడు. ఆటోను పరుగులు తీయించాడు. ఒక్కో ఎక్స్‌ట్రా షిఫ్టు లెక్కేసి కూతురి పెళ్లి కోసం దాచిపెట్టిన డబ్బుకు జత చేసి 5 లక్షలు పోగు చేశాడు. ఎవరి కాళ్లవేళ్ల పడకుండా తన కష్టంతో సంపాదించిన అంత డబ్బుతో జర్మన్-మేడ్ రైఫిల్ కొనేశాడు. కూతురికి పెళ్లి చేయడం తండ్రి బాధ్యత. అయితే, పెళ్లి ఒక్కటే ఆడపిల్ల జీవితం కాదని, వారికి పెళ్లితో ముడిపెట్టని మరో

భవిష్యత్తు కూడా ఉంటుందని అంటున్నాడు గోహిల్.

బుల్లెట్ దిగింది

కొన్ని నెలల ప్రాక్టీస్‌తోనే మిట్టల్ 2013లో 57వ ఆల్‌ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో తొలిసారిగా పాల్గొంది. తోటి షూటర్లు అంజూశర్మ, లజ్జగోస్వామితోపాటు టీమ్ ఈవెంట్లో కాంస్య పతకాన్ని గెలిచింది. ఆ ఈవెంట్లో లజ్జగోస్వామి రైఫిల్‌ను అరువుగా తీసుకుంది మిట్టల్. అదే రైఫిల్‌తో చాలా పోటీల్లో పాల్గొంది. కానీ తర్వాత శిక్షణకు తనకు సొంతంగా రైఫిల్ ఉండాలని తండ్రి ఈ గొప్ప బహుమతిని అందించాడు. ప్రస్తుతం ఆమె ఈ ఏడాది చివరలో జరగనున్న జాతీయ చాంపియన్‌షిప్‌కు గురి పెట్టింది. బుల్లెట్‌కు 31 రూపాయలు అవుతుంది. ఏదైనా టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మిట్టల్ కనీసం 1000 రౌండ్లు కొనాల్సి వుంటుంది. వేలాది తూటాలు రాలితేనే శిక్షణలో రాటుదేలలేరు. అందుకే గోహిల్ మరో షిఫ్టు వేస్తున్నాడు. నైట్ షిఫ్టుల్ని తరచూ చూస్తున్నాడు. అతడి ట్యాక్సీ మీటర్ చప్పుడు వింటేనే మిట్టల్ రైఫిల్ నుంచి తూటా చప్పుడు వినబడుతుంది. అందుకే ఆటోలు నిండిపోయిన అహ్మదాబాద్‌లో ట్రాఫిక్ హోరును దాటి అతడి గొంతుకలో నుంచి తూటాలా మాట గట్టిగా కేక పెడుతోంది ఆటో.. ఆటో.. అంటూ.

- అమల తిలారు

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

అంత పాతదెందుకు?

రాజు ఓ మ్యూజియంలోకి వెళ్లి ఓ వస్తువును తదేకంగా చూస్తూ ముట్టుకోబోయాడు. అతడి చేయి తగలగానే అది ఢమాల్మని కింద పడి పగిలిపోయింది. మ్యూజియం క్యూరేటర్ పరుగు పరుగున అక్కడికి చేరుకుని 'అస్సలు నువ్వేం చేశావో తెలుసా? అది వెయ్యేళ్ల కిందటి వస్తువు' అని అరిచాడు. దానికి రాజు 'హమ్మయ్య! అది అంత పాతదన్న మాట. కొత్తదేమో అని భయపడి చచ్చాను. ఇలాంటిదే కొత్తది చేయించిస్తాలే' అని రిలాక్స్‌డ్‌గా పక్క వస్తువు దగ్గరకు వెళ్లాడు.



ప్రజల సొమ్ము

ఓ రోజురాత్రి ఓ దొంగ ఓ పెద్ద మనిషిని అటకాయించాడు. 'నీ దగ్గర ఉన్న డబ్బుల్ని, ఉంగరాల్ని, చైన్‌ను, వాచీని ఇచ్చేయ్' అని బెదిరించాడు. దానికి ఆ పెద్ద మనిషి 'నేనెవరో తెలుసా? ఈ ప్రాంతానికి రాజులాంటోణ్ని..' అని కళ్లెర్రజేశాడు. దొంగ తడుముకోకుండా 'అయితే అది నీ డబ్బు కాదు. మా డబ్బు. మా డబ్బు మాకిచ్చేయ్' అని ఇంకొంచెం కత్తి ముందుకు జరిపి అడిగాడు.



సిత్రం

బల్గేరియాలో అవునంటానికి పైకి కిందకు, కాదంటానికి అడ్డంగా తలూపుతారు. ఔనంటే కాదనిలే.. కాదంటే ఔననిలే... వీళ్లకు సరిపోతుంది.

స్లో ఫుడ్

ఢాఢా: ఫ్రెంచి వాళ్లు నిదానంగానైనా నత్తగుల్లను తింటానికి ఎందుకు ఎక్కువగా ఇష్టపడతారు.

ఢూఢూ: వారికి ఫాస్ట్ ఫుడ్ అంతగా నచ్చదేమో..!

జాగ్రత్త



దంతాలు: మరీ ముందుకు తోసుకురాకు. మేం పట్టుకుంటే నీ ముక్క తెగి అవతల పడుతుంది. ఏమనుకుంటున్నావో నీ గురించి. మాతో కాస్త జాగ్రత్త.

నాలుక: నేను ఒక్క తప్పుడు మాట మాట్లాడితే మీ 32 పళ్లు రాలిపోతాయి. చెప్పండి ఎవరు జాగ్రత్తగా ఉండాలి.

అట్టమీది కథ

వివిధ దేశాల్లో వినాయక రూపాలు

భారతీయులందరూ కలసికట్టుగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ఒకటి. పదకొండు రోజుల పాటు ఎంతో అట్టహాసంగా జరిగే ఈ పండుగలో ఊరూరా పందిళ్లు వెలుస్తాయి. విభిన్న రూపాల్లో తయారు చేసే గణనాథుల్ని పండాళ్లలో నిలిపి ఆకట్టుకునే కార్యక్రమాలతో ఆ పది రోజులు పండుగ వాతావరణానికి వెలితే లేకుండా చేస్తారు. చిన్నా పెద్దా అందరూ ఎంతో ఇష్టంగా పాల్గొనే గణేశ నిమజ్జన ఒక ఎత్తు. ఇవన్నీ మన దేశంలో కనిపించే వినాయకచవితి సంబరాలు. ఈ పండుగ అమెరికా, లండన్, ఫ్రాన్స్‌లకు పాకిపోయింది. వీటన్నింటికన్నా ముందే థాయిల్యాండ్, ఇండోనేషియా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, చైనా, జపాన్ వంటి దేశాల్లోను వివిధ రూపాల్లో వినాయకుడు కొలువు తీరాడు. ఒక్కో దేశంలో ఒక్కో పేరుతో పిలిచే వినాయకుడి విశేషాలే ఈ వారం అట్టమీది కథ.

సుమారు 10వ శతాబ్దం నాటికే చోటుచేసుకున్న వాణిజ్య పరమైన అభివృద్ధి ద్వారా వివిధ దేశాల ఆచార వ్యవహారాల్లో మార్పుతో పాటు అక్కడ గణేశుడిని పూజించటం బాగా ఎక్కువైందని తెలుస్తోంది. వాణిజ్య కార్యకలాపాల కోసం విదేశాలకు వెళ్లే వర్తకులు వినాయకుడి ప్రతిమలను విదేశీ వర్తకులకి కానుకలుగా ఇచ్చేవారని, హిందూ, బౌద్ధ మత సన్యాసులు విదేశీ యాత్రలు, పర్యటనల వల్ల కూడా అక్కడి సంస్కృతుల్లో గణేషుని రూపం ప్రాధాన్యం మరింత సంతరించుకుంది. డబ్బు వాడకం పుంజుకున్న ఈ కాలంలోనే గణేశుడి భక్త బృందాల కార్యక్రమాలు ఊపందుకోవడంతో థాయిలాండ్, భూటాన్, మయన్మార్ వంటి దేశాల్లో ఆరాధించే ప్రధాన దేవుళ్లలో వినాయకుడికి స్థానం లభించింది. ఆయా దేశాల సంస్కృతులు, విశ్వాసాలు, పురాణాలు, ఆరాధన తీరులకు అనుగుణంగా గణేశుడు కనిపించే రూపం మారింది. అవన్నీ ఆసక్తి కలిగించేవిగా ఉంటాయి. థాయిలాండ్, నేపాల్, ఇతర తూర్పు ఆసియా దేశాల్లో వినాయకుడు చిన్న పరిమాణంలో ఉన్న ఒక తాంత్రికుడి రూపంలో ఉంటే విభిన్న వస్త్రాధారణతో టోపి ధరించిన వినాయకుడి విగ్రహాలు థాయిలాండ్‌లో కనిపిస్తాయి. ఇలాంటి ఆనవాళ్ల ద్వారా ఆ విగ్రహాలు ఏ దేశం నుండి వివిధ దేశాలకు ప్రయాణించాయో గుర్తించేవారు.

థాయ్‌లాండ్

బౌద్ధ మతం ప్రాశస్త్యం ఉన్న థాయిలాండ్‌లో వినాయకుడిని ఎక్కువగా విశ్వసిస్తుంటారు. హిందూ, బౌద్ధ మతస్తులు కలసికట్టుగా వినాయక చవితి పండుగని జరుపుకోవడం ఇక్కడి ప్రత్యేకత. థాయ్ వాణిజ్య నగరంగా పేరొందిన బ్యాంకాక్‌లో వినాయకుడికి సంబంధించిన ఆలయాలు కూడా ఎక్కువగానే దర్శనమిస్తాయి. రఛదామ్రి రోడ్‌లోని ఇసెటాన్ స్టోర్ వద్ద ఉన్న గణేశుడి ఆలయం బ్యాంకాక్‌లో అతిపెద్ద ఆలయంగా ఖ్యాతి గడించింది. ఇక్కడ వినాకుడిని 'ప్రాపికానెడ్' అని పిలుస్తారు. భారత్‌లో తొమ్మిది రోజులు వినాయక చవితి పండుగని జరుపుకుంటే థాయిలాండ్‌లోని పట్టాయ ప్రాంతంలో పదిహేను రోజులపాటు ఈ వేడుకని నిర్వహిస్తారు. ఇక్కడి ల్యాన్ పొ పార్క్ నుండి ప్రారంభమయ్యే గణేష్ విగ్రహాల ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహిస్తారు. రెండు వారాల పాటు కొనసాగే గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో వేలాదిగా థాయ్ వాసులు పాల్గొంటారు. ల్యాన్ పొ పార్క్ నుండి ప్రారంభమైన ఊరేగింపు నక్లువ బీచ్ వద్దవున్న వట్ చొన్‌గ్లోమ్ దగ్గర ముగుస్తుంది. నక్లువాలోని సముద్రంలో వినాయక ప్రతిమల నిమజ్జనంతో ఈ ఉత్సవం పూర్తవుతుంది. గణేశుడు పుట్టిన రోజుగా జరుపుకునే ఈ పండుగ రోజున కొన్ని ప్రాంతాల్లో కుడుముల్ని కేక్‌లా తయారు చేసి క్యాండిల్స్‌తో అలంకరిస్తారు. పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ గణపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపే ఒక వైవిధ్యమైన సాంప్రదాయం థాయిలాండ్‌లో కనిపిస్తుంది. సమన్ రత్తనారమ్ ఆలయంలో 16 మీ. పొడవు 22 మీ. వెడల్పుతో

- అద్దేపల్లి శర్వాణి





తీర్చిదిద్దిన అతి పెద్ద గణేష విగ్రహం ప్రపంచస్థాయి గుర్తింపుని గడించింది.

మారిషస్

హిందూ మహా సముద్రంలోని ఒక చిన్న ద్వీపం మారిషస్. ఇక్కడ దాదాపు 52 శాతంగా ఉన్న హిందువులకి వినాయక చవితి గొప్ప పండుగ. అక్కడ స్థిరపడిన భారతీయులతో పాటు స్థానికులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. అయితే భారతీయ సంతతికి చెందిన భివాజీ కుటుంబం మొదటగా ఇక్కడ వినాయక చవితి పండుగను పరిచయం చేసింది. 1896లో వాక్నెట్టాలోని సెవెన్ క్యాస్‌కేడ్స్ వ్యాలీ (ఏడు జలపాతాలు కలిసిన లోయ ప్రాంతం)లో ఈ పండుగని జరుపుకున్నారు. అప్పటి నుండి మారిషస్‌లో ఏటా ఈ పండుగని అక్కడి ప్రజలూ వేడుకలా చేసుకుంటున్నారు. మారిషస్ వాసులందరూ ఆనందోత్సాహాలతో భాగమవుతుండటంతో అధికారికంగా వినాయక చవితి రోజున సెలవు కూడా ప్రకటించింది మారిషస్ ప్రభుత్వం. ప్రతి ఏటా ఒక పెద్ద ఉత్సవంగా జరుపుకుంటున్నారు.

యూరప్- లండన్

యూరప్‌లోని వివిధ ప్రాంతాల్లో ఎక్కువగా భారతీయులు నివసిస్తుండటంతో భారతీయ సంస్కృతికి సంబంధించిన పండుగలు ఇక్కడ ప్రాముఖ్యతని సంతరించుకున్నాయి. వినాయకుడిని సైన్యాధిపతిగా భావిస్తూ యూరప్‌లోని వివిధ ప్రాంతాల్లో ఎప్పటి నుంచో ఆరాధనలు మొదలైనా లండన్‌లో మాత్రం 2005 నుండి ఈ పండుగని జరుపుకుంటున్నారు. చివరి రోజున నిర్వహించే నిమజ్జన వేడుక శోభాయాత్రతో మొదలౌతుంది. దాదాపు నాలుగు వేల మంది ఈ యాత్రలో పాల్గొంటారు. గణపతి ఊరేగింపుతో సాగే శోభాయాత్రకు పోలీసుల భద్రత ఉంటుంది. 50 మందికి పైగా వలంటీర్లు యాత్రలో పాల్గొనే వారికి సాయపడుతుంటారు. ఈ యాత్రకి భారతీయులతో పాటు అక్కడి స్థానికులు హాజరవుతారు. కింగ్ స్ట్రీట్, సౌత్ హాల్ మీదుగా థేమ్స్ నదిని చేరుకోవడంతో యాత్ర పూర్తవుతుంది. పుట్నీ పీర్ వంతెన వద్ద ఉన్నతాధికారులు, పెద్దల సమక్షంలో గణపతి నిమజ్జనాన్ని పూర్తిచేస్తారు.

అమెరికా

అమెరికాలోని భారతీయులు తమ ఇళ్లలో ఈ పండుగను జరుపుకోవడంతో పాటు హిందూ, బౌద్ధ, జైన మతాలకి సంబంధించిన మత సంస్థలూ వినాయకచవితి వేడుకల్ని నిర్వహిస్తుంటాయి. వ్యారెన్ విల్లే, ఇల్లినాయిస్ ప్రాంతాల్లో ఎంతో అట్టహాసంగా జరిగే ఈ పండుగకి అమెరికాలోని భారతీయులతో పాటు వివిధ దేశాలకి చెందిన వారు హాజరవుతుంటారు. రకరకాల రూపాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా సాగే యాత్రలో పిల్లలు పెద్దలు ఆనందోత్సాహాలతో పాల్గొంటారు.

ఫ్రాన్స్

ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో భారీ స్థాయిలో వినాయక చవితి పండుగని నిర్వహిస్తారు. పది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగలో చివరి రోజు రథోత్సవాన్ని నిర్వహిస్తారు. వినాయకుడి విగ్రహాన్ని ఉంచిన రథాన్ని లాగుతూ స్థానికులు భజన, కీర్తనలు పాడుతుంటారు. హిందువులందరూ సాంప్రదాయ దుస్తులని ధరించి ఈ రథోత్సవంలో పాల్గొంటారు. నాలుగు కిలోమీటర్లు సాగే ఈ రథోత్సవంలో శ్రీలంక, ఫ్రెంచ్ వారితో పాటు మిగతా యూరోపియన్లు కూడా అధికంగా పాల్గొంటారు. ఫ్రాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకకి వినాయకుడి బొమ్మల నిమజ్జనం కంటే రథోత్సవానికే ప్రాముఖ్యత ఎక్కువ.

కంబోడియా

పొడవాటి తొండం, అస్త్రాలు ధరించి ఉన్న రెండు చేతులు, కాలిపై కాలు వుంచి కనిపించే వినాయకుడి రూపాన్ని కంబోడియాలో 'ప్రా కీన్స్' అని పిలుస్తారు. సాధారణంగా అన్ని దేశాల్లో పెద్ద పొట్టతో ఉండే వినాయకుడి విగ్రహాలకి భిన్నంగా ఉంటుందీ రూపం. కంబోడియాలో అతిప్రాచీన నగరంగా పేరొందిన అన్కోర్ ఖ్మేర్ సామ్రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఈ నగరంలో ఉన్న పురాతన గణపతి ఆలయం 'టా ప్రొహ్మ'. 19వ శతాబ్దంలో ఫ్రెంచి వాళ్లు ఈ ఆలయాన్ని కనుగొన్నారు. టా ప్రొహ్మ ఆలయం పునరుద్ధరించకపోవడంతో ఇప్పటికీ ఆలయం గోడలపై 'ప్రా కీన్స్' విగ్రహం కనిపిస్తుంది.

సింగపూర్

హిందూ పండుగలు సింగపూర్‌లో వందలాది ఏళ్ల క్రితమే ప్రవేశించాయి. ఇక్కడి సెన్పగ్ వినాయగర్ ఆలయం దక్షిణ ఆసియా ఖండంలోనే అతి పెద్ద గణపతి ఆలయంగా గుర్తింపు లభించింది. 150 ఏళ్లనాటి ఈ ఆలయంలో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో చైనీయులు, భారతీయులు ఎక్కువగా పాల్గొంటారు. ఆఫ్రికన్ మహాగనీ చెట్ల కొమ్మలతో గణేశుడిని పూజిస్తారు. నవరాత్రుల సమయంలో వందలాదిగా వచ్చే భక్తుల్ని నియంత్రించడం కోసం ఇక్కడ కొందరు వలంటీర్లుగా పనిచేస్తారు. తొమ్మిది రోజులపాటు

అతి పొడవైన వినాయకుడు

ఏటా జరుపుకునే వినాయకుడి వేడుకల్లో వినాయక విగ్రహాల తయారీలో విభిన్నతతో పాటు అతి పొడవైన విగ్రహంగా గుర్తింపు కోసం మనదేశంలోని వివిధ రాష్ట్రాల్లో పోటీ పడుతుంటారు. చవితి పండుగ కోసం ప్రత్యేకంగా తయారుచేసే వినాయకుడి విగ్రహాల్లో విభిన్న రూపాల్లో కనిపించేవి కొన్నయితే దేశంలోనే అతి పెద్ద విగ్రహంగా కొలువుతీరిన విగ్రహాలు మరికొన్ని. ఎప్పటికప్పుడు గణేషుడి విగ్రహాల తయారీలో నూతనత్వం కోసం పోటీ పడుతుంటారు కళాకారులు. గణేషుడి నవరాత్రులకోసం కొన్ని నెలల ముందు నుంచే కష్టించి చేసే ఆ మట్టి విగ్రహాల్లో జీవకళ ఉట్టిపడుతుంది. ఇప్పటి వరకు మహారాష్ట్రలోని 85 అడుగుల చిన్మయ గణపతి భారతదేశంలోనే అతి పెద్ద గణపతి విగ్రహంగా కొలువుదీరితే.. ప్రస్తుతం తోప శంభాపూర్ గణపతి విగ్రహం

ఎత్తైన విగ్రహంగా ప్రపంచ స్థాయి రికార్డును దక్కించుకుంది. పూణె -బెంగుళూరు రహదారిని ఆనుకుని ఉన్న కొల్హాపూర్‌లో 100 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని ఇటీవలే తీర్చిదిద్దారు.

భారీ రీతిలో పండుగని నిర్వహిస్తారు. నవరాత్రులు నిర్వహించే సమయంలో ఈ ఆలయంలో పూలు, ఆకులు, పండ్లని తప్ప డబ్బుని కానుకగా తీసుకోరు.

చైనా, జపాన్..

బౌద్ధ బిక్షువుల ద్వారా చైనా, జపాన్ దేశాలకు వినాయకుడి విగ్రహాలు చేరడం ద్వారా అక్కడ కూడా గణేశుడిని ఆరాధనలు జరిగేవి. ఆక్కడి ప్రాంతీయతకు తగ్గట్టుగా వినాయకుడికి సంబంధించిన కొన్ని విగ్రహాలని తయారుచేసేవారు. శాసనం 531 ద్వారా ఉత్తర చైనాలో తొలి రాతి విగ్రహ ఆరాధనలు అప్పుడే ప్రారంభమయ్యాయి. చైనాలోని తున్ హుయాంగ్, కుంగ్ సీన్ ప్రాంతంలో రాతి గుహల్లో చెక్కిన కొన్ని గణేషుడి విగ్రహాలు క్రీ.శ. 806లోనే లభించాయి. జపాన్, చైనాలలో వినాయకుడిని షోటెన్ లేదా కాంజిటేన్ అని పిలుస్తారు. తూర్పు ఆసియాలోని వివిధ దేశాల్లో, జపాన్, చైనాలలో కొలువుదీరిన వినాయకుడు ఒక్కడే అయినా ఈ రెండు దేశాల్లోని గణేషుడి వస్త్రధారణలో కొంత విభిన్నత కనిపిస్తుంది. ఒకే ఏనుగు తలతో ఆలింగనం చేసుకుని మగ, ఆడ శరీరాలతో ఉన్న గణపతి రూపం చైనాలో లభించింది. కిరీటం, సాధువు వస్త్ర ధారణలో స్త్రీ రూపంలో గణేశుడు కనిపిస్తే, పొడవైన తొండం భుజాలపై నల్లటి వస్త్రాన్ని ధరించిన పురుషుడి విగ్రహం కనిపిస్తుంది. మగ రూపంలో ఉండే గణేషుడు ఎరుపు-గోధుమ రంగుతో పెద్ద తొండం, దంతాల్ని కలిగుంటే స్త్రీ రూపంలోని గణేషుడు తెల్లటి వర్ణంలో చిన్నపాటి తొండం, దంతాల్ని కలిగుంటాడు.

జపాన్‌లో క్రీ.శ. 806లోనే గణేశుడిని కొలిచే సాంప్రదాయం మొదలైంది. క్రీ.శ. 859లో జిక్కాకు డైషి అనే బౌద్ధ భిక్షువు మత్సుషియామా షోటెన్ బౌద్ధ దేవాలయాన్ని దర్శించినప్పుడు అక్కడ లభించిన చెక్కపై వినాయకుడి రూపాన్ని చెక్కినట్టు ప్రచారం ఉంది. దాయి షా కాంగిటెన్‌గా పిలవబడే ఈ వినాయకుడిని వాణిజ్య ప్రాంతంగా పేరొందిన టోక్యోలో వర్తకులు పూజించేవారు. టోక్యోలోని అశకుశ జిల్లాలో ఉన్న కాంగిటేన్ ఆలయంలో నిర్వహించే వినాయక చవితి వేడుకల్లో భారతీయ, జపాన్, చైనా వాసులు అధికంగా పాల్గొంటారు. ఇక్కడ వినాయకుడికి ముల్లంగిని కానుకగా ఇస్తారు. సహజంగా ఏ ఆలయంలోనైనా ముందున్న ప్రవేశ ద్వారం నుండి లోనికి చేరుకుంటారు. అయితే కాంగిటేన్ ఆలయాన్ని వెనుక నుండి ప్రవేశిస్తుంటారు. ఆలయం వెనుక భాగంలో ఉన్న కొండపై నుండి ఇక్కడికి చేరుకోడానికి ఉన్న రైలు మార్గంతో పాటు కొంత ఎత్తు నుండి ఒక్కసారిగా దిగుతున్నట్టు ఉండే ఈ రైలు ప్రయాణం ఇక్కడో ప్రత్యేక ఆకర్షణ. ముందున్న ప్రవేశ ద్వారం నుండి లోనికి ప్రవేశిస్తే ఈ అనుభూతుల్ని మిస్సయిపోతారు. ఆలయం చుట్టూ చెట్లతో ఆహ్లాదకరంగా ఉండే ఈ ఆలయాన్ని వినాయక చవితి రోజు ఎక్కువగా దర్శిస్తారు.

ఇండొనేషియా

భారత్‌లోలానే ఇండోనేషియాలో గణపతి ఉత్సవాల్ని నిర్వహించినా గణపతి నిమజ్జనం మరింత కోలాహలంగా ఉంటుంది. ఇళ్ల నుండి జనం పెద్ద ఎత్తున వీధుల్లోకి చేరుకుని ఊరేగింపుగా వచ్చే గణనాయకులకి టెంకాయల్ని కొడతారు. నిమజ్జనం నిర్వహించే రోజున అక్కడి రోడ్లన్నీ దాదాపు టెంకాయ చిప్పలతో నిండిపోతుంటాయి. వీటిని తొలగించాలంటే పారిశుధ్య కార్మికులకు దాదాపు ఒక రోజు

గణేశ్ హిమాల్ మ్యూజియం

వినాయకుడిని ఎక్కువగా ఇష్టపడే థాయిలాండ్‌లోని చియాంగ్‌మై ప్రాంతంలో ఉంది గణేష్ హిమాల్ మ్యూజియం. ఖున్ పన్దారా తీరకనాన్ద్ ఈ మ్యూజియాన్ని నిర్వహిస్తున్నాడు. బ్యాంకాక్‌లో పుట్టిపెరిగిన తీరకనాన్ద్‌కి తన 19 ఏట తండ్రి ఇచ్చిన వినాయకుడి బొమ్మ అతన్ని ఎంతగానో ఆకట్టుకుందట. అప్పటి నుండి విభిన్నంగా వుండే గణేష్ బొమ్మలు, పెయింటింగ్స్‌ని సేకరించడం ప్రారంభించాడు. వాటి కోసం సొంతగా మ్యూజియంని నిర్మించాడు తీరకనాన్ద్. ఆసియా ఖండంలోని అనేక దేశాలకి సంబంధించిన వెయ్యికిపైగా వినాయకుడి కళాకృతులని ఈ మ్యూజియంలో ఉంచారు. శాన్ పటాంగ్ ప్రాంతంలో 1.9 ఎకరాల్లో ఎంతో అందంగా నిర్మించిన ఈ మ్యూజియాన్ని చూసేందుకు వచ్చే సందర్శకుల కోసం గణేశుడి పెయింటింగ్స్, బొమ్మల్ని కొనుగోలు చేసే ఒక



షాప్‌ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 గం. నుండి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకుల కోసం ఈ మ్యూజియాన్ని తెరిచుంచుతారు. ఇక్కడ ప్రవేశం పూర్తిగా ఉచితం.

కొలంబోలో మ్యూజియం

శ్రీలంక ప్రభుత్వం నిర్వహణలో ఉన్న కొలంబో నేషనల్ మ్యూజియంలో 12వ శతాబ్దం నాటి గణేషుడి ఏకశిలా విగ్రహాలు, కాంస్య విగ్రహాలు ప్రదర్శనకు ఉంచారు. ఇక్కడ అతి పురాతన రాతి విగ్రహాలు దర్శనమిస్తాయి. అయితే ఆవి ఏప్రాంతానికి చెందినవి, ఎప్పటివనే సమాచారం మాత్రం లభించలేదు.



పడుతుంది. ఇండోనేషియాలోని బాలి ప్రాంతపు ప్రజలు ఆరాధించే వినాయకుడి ఆలయాలే కాదు అక్కడ కరెన్సీ నోట్లపైనా వినాయకుడు కనిపిస్తాడు. ఇండోనేషియా స్వాతంత్ర్యం కోసం పోరాడిన కి హజర్ దివన్ర పుట్టిన రోజును ఇండోనేషియా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారు. ఆయన గౌరవార్థం తరగతి గదిలో విద్యార్థుల చిత్రాన్ని నోటుపై ఉంచారు. అంతే కాదు అతని బొమ్మని కరెన్సీ నోటుపై ముద్రించడంతో పాటు దివాన్తర్ ఇష్టపడే గణేషుడి బొమ్మను కూడా కరెన్సీ నోటుపై ముద్రించారు.

శ్రీలంక

బౌద్ధ మతం ఎక్కువగా విస్తరించిన శ్రీలంక ఒకప్పటి సీలోన్‌కి దక్షిణ భారత దేశం నుండి హిందువులు వలస వెళ్లారు. వారి వారసులుగా ఉన్న 20 శాతం మంది హిందువుల ద్వారా శ్రీలంకలో గణేశుడి ఆరాధనలు పరిచయమయ్యాయి. శ్రీలంకలోని నువెరా ఎలియా కొండ ప్రాంతంతో పాటు, రహదారి కూడళ్లు, చెట్ల కింద ఉంచిన వినాయక ప్రతిమల్ని కొలిచే వారు. విగ్రహం ఉదర భాగం నుండి చిన్న వస్త్రంతో, నల్లటి రూపంలో ఉండే విగ్రహాలు దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధి పొందిన బాల గణపతి రూపం పిల్లయార్. గణేషుడిని ఆ పేరుతోనే ఇక్కడ కూడా ఆరాధిస్తారు. జానపద కళాకృతుల్లో రూపుదిద్దిన గణేశ విగ్రహాలు శ్రీలంకలోని అనురాధపుర, పూలన్నరువ అటవీ ప్రాంతాలకు చేరుకునే రోడ్డు మార్గాల్లో కనిపిస్తాయి. ఈ గణేశుడి విగ్రహాలు ఉత్తర భారతదేశంలోని కర్నాటకలో పేరొందిన మురాల్ చిత్రాలని పోలుంటాయి. కొన్ని బౌద్ధ ఆరామాల్లోనూ బుద్ధుడి విగ్రహాలతో పాటు గణేషుడి విగ్రహాలను ఉంచారు. ఉత్తర క్యాండీ ప్రాంతంలో రాతి గుహల్లో నిర్మించిన అలువిహారా ఆలయం, దంబుల్లా ఆలయాల్లో హిందూ బౌద్ధ మత సామరస్యం స్పష్టమౌతుంది. బుద్ధుడి విగ్రహాలతో పాటు కొలువుదీరిన గణేశుడి విగ్రహాలు ఎక్కువగా దర్శనమిస్తుంటాయి. అయితే క్యాండీ ప్రాంతంలో ప్రత్యేకంగా గణేషుడి కోసం లంకతిలక ఆలయాన్ని నిర్మించారు. శ్రీలంక రాజధాని కొలంబో శివారు ప్రాంతంలో ఉంది కెలన్య ఆలయం. ఈ ఆలయంలోని దక్షిణ ప్రాకారంపై ఎలుక వాహనంపై ఉన్న పెద్ద వినాయక విగ్రహం కనిపిస్తుంది. శ్రీలంకలో ఉన్న వినాయక విగ్రహాలన్నిటిలో స్పష్టమైన గణేషుడి రూపంలో ఉంటుందీ విగ్రహం.

సి.ఎమ్.ఐ మ్యూజియం

ప్రపంచ దేశాల్లో పిల్లల కోసం ఏర్పాటు చేసే మ్యూజియాలన్నిటిలో అతి పెద్దది చిల్డ్రన్ మ్యూజియమ్ ఆఫ్ ఇండియానాపోలిస్ (సిఎమ్ఐ). అమెరికాలోని ఇండియానాపోలిస్‌లో నేషనల్ జియోగ్రఫిక్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ మ్యూజియంలో పిల్లలు ఎక్కువగా ఇష్టపడే గణేష్ విగ్రహాన్ని ఉంచారు. ఆ మ్యూజియంలో ఉన్న వింతలు విశేషాల కంటే ఇప్పుడు ఏనుగు తొండం, మనిషి శరీరంతో ఉండే ఆ గణేషుడిని చూసేందుకు ఎంతోమంది పిల్లలు వివిధ దేశాల నుండి వస్తుంటారు.

జపాన్‌లో గణేశ రూపం

టిబెట్

టిబెట్ నేపాల్ దేశాల్లో తాంత్రిక బౌద్ధ రూపంలో ఉన్న వినాకుడిని ఆరాధిస్తారు. మహారక్త అని పిలిచే ఈ వినాయకుడు మూడు కళ్లు, ఎర్రటి శరీరం, కొప్పుపై ఉన్న కిరీటంపై ఎర్రటి సిల్కు రిబ్బన్లతో, పన్నెండు చేతులతో అస్త్రాలని పట్టుకుని ఉండే ఈ రూపం అన్ని దేశాల్లో కంటే విభిన్నంగా ఉంటుంది.

ఆఫ్ఘనిస్థాన్

ఒకప్పుడు భారత్‌లో భాగమైన ఆఫ్ఘనిస్థాన్‌లో వినాయకుడి ఆరాధకులు ఇప్పటికీ అక్కడ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో గణేషుడిని 'మహ వినాయక' అని పిలుస్తారు. పురావస్తు శాఖ తవ్వకాల్లో యుద్ధానికి పూర్వం 753 కాలానికి చెందిన పురాతన పాలరాతి గణేషుడి విగ్రహాలు లభించాయి. తలపై కిరీటం, పులి చర్మాన్ని ధరించి ఉండే ఈ రూపాన్ని గాంధార రూపంగా పిలుస్తారు. కాబూల్‌లోని దార్గా పిర్ రతన్‌నాథ్ ఆలయంలో ఉంచిన ఈ గణేశుడిని హిందువులతో పాటు, ముస్లిములు సందర్శిస్తారు. భారతదేశంలోని అన్ని ప్రాంతాలక కంటే మహారాష్ట్రలో వినాయకచవితి అట్టహాసంగా జరుపుకుంటారు. వినాయకచవితి పందిళ్లను పండాల్ అంటారు. పెద్దలతో పాటు పిల్లలు కూడా ప్రత్యేకంగా బొజ్జ గణపతి విగ్రహాలతో పండాల్‌ని ఏర్పాటు చేస్తుంటారు. 'గణపతి బప్పా మోరియా' అనే నినాదాల మధ్య అంబరాన్ని అంటే వినాయక విగ్రహాలతో 'గణేష్ విసర్జన్' వినాయకుడి నిమజ్జన కార్యక్రమం వేలాదిమందిలో కన్నులపండువగా సాగుతుంది. బొజ్జ గణపతి, వినాయకుడు, గణనాథుడిగా తెలుగు రాష్ట్రాల్లో గణేషుడిని పిలుస్తుంటారు.



చెన్నయ్ పిల్లయార్

చెన్నయ్‌లో వినాయకుడిని బాలగణపతి రూపంలో కొలుస్తారు. బాలరూప గణపతిని పిళ్లయార్‌గా పిలుస్తారు. 'వినాయక చతుర్థి' లేదా 'పిళ్లయార్ చతుర్థి'గా సంబోధించే వినాయక చవితి రోజున మట్టి గణేషుడి విగ్రహాన్ని బోధి చెట్టు కింద ఉంచి కొలిచే ఒక ఆచారం కూడా ఇక్కడ కనిపిస్తుంది. బియ్యప్పిండితో తయారు చేసే తీపి వంటకం ఖోజకట్టాయ్‌ని ఇళ్లలో తయారు చేసి మిత్రులు, బంధువులకి పంచిపెడతారు.

కేరళలో తిరునాళ్లు

వినాయకుడికి ఇక్కడ విశిష్టత ఎక్కువ. లంబోదర పిరణాళ్లుగా పిలిచే వినాయక చవితి రోజున కేరళలో ఏనుగులని ప్రత్యేకంగా అలంకరిస్తారు. వాటికి ఇష్టమైన చెరుకు గడలు టెంకాయ చిప్పలు, అరటి పళ్లను ఆహారంగా అందిస్తారు. ఇంటి ముంగిళ్లని చక్కటి రంగవల్లులతో తీర్చిదిద్దడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలని నిర్వహిస్తారు.

గోవా చోవత్

గోవాలో చోవత్‌గా జరుపుకునే వినాయక చవితి మహారాష్ట్రలోని భారీ గణేషుడి విగ్రహ ఆరాధనలకి చాలా తేడా ఉంటుంది. వినాయక పందిళ్లలో ఇళ్లలో ఎక్కువగా చిన్న పరిమాణంలో ఉండే విగ్రహాలే ఇక్కడ దర్శనమిస్తాయి. వినాయక పందిళ్లని ఎక్కువగా అరటి మామిడి ఆకులతో అలంకరిస్తారు. నృత్యం, పాటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

వింత లోకం



ఎక్సర్‌సైజ్ సైకిల్‌తో యూకే యాత్ర

సైకిల్ యాత్రలు విన్నాం గానీ ఎక్సర్‌సైజ్ సైకిల్‌తో ఏం ప్రయాణం చేయగలం. ఎంత తొక్కినా అది కదలదు కదా అంటారా..! కానీ ఆరోన్ పూజీ యూకేలో రోజుకో నగర వీధుల్ని చుట్టేస్తున్నాడు. అదీ ఇల్లు కదలకుండా. ఎలా కుదిరిందంటే వర్చువల్ రియాల్టీ వల్ల. తన మొబైల్ ఫోన్ వీ-ఆర్ గేర్‌కు గూగుల్ స్ట్రీట్ వ్యూ మ్యాపుల్ని అనుసంధానించే ఓ యాప్ కనిపెట్టాడు ఆరోన్. ఎంచక్కా అది తలకు తగిలించుకుని ఎక్సర్‌సైజ్ సైకిల్ తొక్కుతున్నాడు. అతడి వేగానికి అనుగుణంగా స్ట్రీట్‌వ్యూ చిత్రాలు కదులుతుంటాయి. 3డి వ్యూలో ఉండే వీఆర్ వల్ల వీధుల్లో సైకిల్ తొక్కుతున్నట్టే ఉంటుందట. అంతకు ముందు పొద్దున్నే లేచి నిద్ర మొహంతో వ్యాయామం చేయాలంటే విసుగ్గా ఉండేదట ఆరోన్‌కు. అది కూడా ఆ నాలుగు గదులకే పరిమితమై ఎక్సర్‌సైజ్ బైక్ తొక్కడానికి మించిన బోర్ ఇంకోటి లేదట. ఇప్పుడు మాత్రం యూకే వీధుల్ని చూస్తూ యాత్ర చేస్తున్న ఫీలింగ్ కలుగుతోందట. అందుకే మొత్తం యూకేను ఇలా ఇంట్లో కూర్చునే చుట్టేయాలని నిర్ణయించుకున్నాడు. లాండ్స్ ఎండ్ ప్రాంతం నుంచి జాన్ ఒ గ్రోట్స్ ప్రదేశం వరకు 1500 కి.మీ.ల వీ-ఆర్ యాత్ర సాగిస్తాడని ప్రకటించాడు. బానే ఉంది కానీ ఎప్పుడూ వీ-ఆర్ లోకమేనా వీలున్నప్పుడల్లా నిజమైన సైకిల్ యాత్ర చేస్తే మంచిదేమో.



ఒక మొక్క... 131 పుచ్చకాయలు

ఒక కాపులో 131 కాయల్ని విరక్కాసి ఓ పుచ్చకాయ తీగె రికార్డు నమోదు చేసింది. అది కేవలం 90 రోజుల సాగులోనే. సాధారణంగా అయితే 1-4 కాయలు మాత్రమే కాస్తాయి. పదుల సంఖ్యలో పిందెలున్నా బలమైనవి మాత్రమే మనగలిగి మిగతావన్నీ రాలిపోతాయి. మరి ఇదెలా సాధ్యమైందంటే 'టియాన్లాంగ్ 1508' ప్రాజెక్ట్ వల్లే. చైనా వ్యవసాయ శాస్త్రవేత్త జు క్స్యాగాంగ్ పరిశోధక బృందం కృషే ఇది. నీటి ఉష్ణోగ్రతే కీలకమని ఆ బృందం చెబుతోంది. అలాగే తీగెలు ఒక దానితో ఒకటి చుట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. క్సిజెంగ్ వ్యవసాయ క్షేత్రంలో ఏప్రిల్ 26న అంకురం తొడిగితే అది మే 1న తీగెలల్లి జూన్ 1న పూలు వికసించి జులై 31న కాయల్ని కాసింది. 'వాటర్‌మెలన్ కింగ్'గా పిలుస్తున్న ఈ వంగడానికి చీడ సోకదట. అలాగే ఎటువంటి ఇసుక నేలల్లోనైనా మనగలదట. గిన్నిస్ రికార్డుకెక్కిన ఈ 'వాటర్‌మెలన్ కింగ్' సాధారణ రైతులకు చేరే అవకాశం ఉందో లేదో పరిశోధక బృందం ఇంకా ప్రకటించలేదు. అంతకు ముందు చైనాకు చెందిన జెంగ్జౌ విత్తన పరిశోధనాభివృద్ధి సంస్థ రూపొందించిన 'ఆక్టోపస్ టొమాటో ట్రీ' వంగడం ఒక్క కాపులో 30 వేల టొమాటోల్ని కాసింది.

డైవింగ్ దాటి డాడ్సింగ్

మొన్నే ఒలింపిక్స్ పూర్తయ్యాయి. అందులో కొన్ని ఆటలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. వాటిలో డైవింగ్ ఒకటి. ఎత్తు మీది నుంచి విన్యాసాలు చేస్తూ నీటిలోకి దూకే డైవింగ్‌ను ఇంకాస్త సాహసంతో చేస్తే డాడ్సింగ్ అని నార్వేలో అంటున్నారు. ఆ మాట ఇప్పుడు యూరప్ అంతా డైవ్ చేసేస్తోంది. ఇంతకీ డాడ్సింగ్ అంటే... పొట్టను ఫ్లాట్‌గా ఉంచి డైవ్ చేయడం. ఇందులో కష్టమేమంటే ఫ్లాట్‌గా నీటిని తాకితే ఎత్తు నుంచి రోడ్డు మీద పడినట్టే ఉంటుంది. ప్రమాదకర గాయాలు కూడా అవుతాయి. అందుకే నీటిలోకి చేరేపుడు చేతుల్ని ముందుంచుతారు. డైవ్‌లో శరీరం ఫ్లాట్‌గా కాకుండా జాగ్రత్త పడతారు. కానీ డాడ్సింగ్‌లో మాత్రం చివరి క్షణం వరకు ఫ్లాట్‌గా ఉండి అప్పుడు జాగ్రత్త పడాలి. ఎవరు ఎక్కువ సేపు అలా ఉండగలుగుతారో వారే విజేత. 'డెత్ ఆఫ్ డైవింగ్'గా పిలుస్తోన్న డాడ్సింగ్‌ను 1960లో ఓస్లోలో డేర్ చేశారు కొందరు మిత్రులు. 2008లో ప్రపంచ పోటీల స్థాయికి చేరింది. 2011 నాటికి బాగా ఆదరణ పొంది 100 డైవర్లు పోటీల్లో పాల్గొంటున్నారు. తొలి పోటీలకు ఓ డజన్ మంది కూడా లేని ప్రేక్షకులు ఇప్పుడు వేలాది సంఖ్యలో హాజరవుతున్నారు.





ఆత్మరక్షణ కోసం ఎన్నో యుద్ధ తంత్రాలు వెలుగులోకి వచ్చాయి. అలాంటి యుద్ధ కళే కర్రసాము. ప్రస్తుతం అక్కడక్కడ మాత్రమే కర్రసాము చేసేవారు కనిపిస్తారు. ఇదే కర్రసామును శిలంబన్ పేరిట తమిళనాట అభ్యసిస్తారు. దీన్ని పురుషులకు మాత్రమే నేర్పేవారు. అలాంటిది ఓ మహిళ శిలంబన్‌లో దిట్ట అయ్యింది. శిలంబన్‌లో సంచలనంగా మారిన ఆమే 27 ఏళ్ల ఐశ్వర్య మణివణ్ణం.

శిలంబన్ మహిళ

జాతీయ చేనేత దినోత్సవం నాడు చేనేత చీరను కట్టి, కర్ర చేతబట్టి ఐశ్వర్య ఇచ్చిన శిలంబన్ ప్రదర్శన వార్తల్లోకి ఎక్కింది. సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. ఓ స్త్రీ శిలంబన్‌ను చేయగలుగుతుందా అనే వారు ఆ ప్రదర్శన చూసి ఆశ్చర్యపోతున్నారు. కర్రసాము వంటి విద్యలు కేవలం ఆత్మరక్షణార్థం, లేదా పోట్లాడేందుకు మాత్రమే అని ఆమె విశ్వసించడం లేదు. సామర్థ్యానికి, ప్రతిభకు సవాల్ విసిరే మార్షల్ ఆర్ట్స్‌లో అదీ మహిళలకు నిషేధమన్న విద్యలో ఆరితేరి అప్పటివరకు ఉన్న చిన్నచూపుపై కర్రెత్తాలని ఐశ్వర్య శిలంబాన్ని ఎంచుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించే వ్యక్తిగత కర్రసాము పోటీల్లో ఆమె విజయాలు సాధించింది. ఇటీవల మలేసియాలో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్, ఆసియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆమె బంగారు, రజత పతకాలను సాధించి సత్తా చాటింది.

నాట్యమయూరే యుద్ధనారీమణిగా..

ఐశ్వర్య శిలంబన్‌లో ప్రస్థానం ఒక విచిత్రం. చెన్నయ్‌లో డిగ్రీ చదివిన తర్వాత ఆమె సింగపూర్‌లో ఇంటీరియర్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేశారు. తర్వాత భారత్ తిరిగివచ్చాక చెన్నయ్‌లోని లయోలా కళాశాలలో అధ్యాపకురాలిగా మారారు. అప్పుడే భరతనాట్యం నేర్చుకోవాలని ఓ కళా కేంద్రంలో చేరింది. అక్కడి గురువు ఏదైనా యుద్ధకళ నేర్చుకుంటే నాట్యంలో మరింత నైపుణ్యం మెరుగవుతుందని సలహా ఇచ్చారు. అప్పుడు జిమ్ కోచ్ ద్వారా శిలంబన్ గురువు పవర్ పాండ్యన్‌ను కలిస్తే ఈ విద్యను పరిచయం చేశారు. నందనంలోని వైఎంసీఏ గ్రౌండ్స్‌లో ఇచ్చే శిక్షణా తరగతులకు హాజరైంది. ఆ యుద్ధ కళను అమితంగా ఇష్టపడిన ఐశ్వర్య నాట్యానికి బై చెప్పేసింది. మూడున్నరేళ్లుగా సాము చేస్తున్న ఆమెకు ఇప్పుడు ఈ యుద్ధ కళ ప్రాణమైపోయింది.



ఆయుధం శరీరంలో ఒక భాగంగా చూసే శిలంబన్‌లో ఆయుధాన్ని ఒక కళాత్మక దృష్టితో చూస్తూ అభ్యసిస్తుంది ఐశ్వర్య. కర్రసాము అనేది ధ్యానంతో సమానమనే ఆమె ఈ విద్యనభ్యసించడంతో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకత, ఆలోచన, ఆరోగ్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నానని అంటారు. ఈ యుద్ధ విద్య అంటే కేవలం కర్రను తిప్పటమొక్కటే కాదు. ఈటె, జింకకొమ్ము, కత్తి వంటి ఆయుధాలతో సాంకేతికంగా అభ్యసించాలి. కంబు, మాన్ కొంబు మడువు, వాల్ వీచు, సురుల్ వాల్‌గా పిలిచే రకరకాల ఆయుధాలను ఎంతో అలవోకగా ఆమె ఉపయోగిస్తారు. దీన్ని క్రీడాస్ఫూర్తితోనూ ప్రదర్శించే యుద్ధకళగానూ గుర్తింపుంది. సాంకేతిక అంశాలపై పెద్దగా ఏమి తెలిసేది కాదు ఐశ్వర్యకు. ప్రాథమిక దశలో ఈ కళ కొందరికి మాత్రమే పరిమితమవడంతో ప్రాచుర్యం తక్కువ. తమిళనాట ఈ కళను గుర్తించి ప్రతిభను బట్టి కొన్ని అర్హతలను రూపొందించారు. కరాటేలో ఎలాగైతే బ్లాకు



బెల్టు, గ్రీన్ బెల్టు అని ఇస్తారో, ఇందులోనూ ఆ రకంగా ప్రతిభను బట్టి వారి స్థాయికి తగ్గట్టుగా అర్హతని నిర్ణయిస్తారు. ఐశ్వర్య ఈ విద్యలో గ్రీన్‌బెల్ట్‌ను సాధించింది. ప్రతిభని వెలికితీసేందుకు దేశవ్యాప్తంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. చేనేతలన్నా ఐశ్వర్యకు ఇష్టం. అందుకే చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శనలిస్తుంది. అలా ప్రజల్లో వాటికి ప్రచారం మరింత పెంచాలనే ఉద్దేశం ఆమెది.

- పద్మా సతీష్

"గురు వాక్కులలో కమ్మదనం వెలలేనిది.. అవి విలువైనవి" అంటాడు ఒక కవి. నిజంగా గురువు అనే భావనే జ్ఞానానికి కేంద్రబిందువై విజ్ఞాన పునాదిగా సమాజ నవ వికాసానికి నాందీ వాక్యమౌతుంది. అయితే అక్షరాలను గుట్టలు గుట్టలుగా పోసి, ఒక్కొక్క అక్షరాన్ని లక్షల రూపాయలకు అమ్ముకుంటూ, ర్యాంకులనే విద్యార్థి మేధో పునాదులపై విద్యావ్యాపార భవనాలు నిర్మిస్తోన్న స్వార్థపూరిత విద్యా వ్యవస్థ ఉన్న ఈ సమాజంలో ఒక్క పైసా కూడా ఆశించకుండా బడుగు జనులకు నిస్వార్థంగా సేవలందిస్తూ, నిరక్షరాస్య సమాజానికి విజ్ఞాన వెలుగులనందిస్తోన్న ఉపాధ్యాయులు ఎందరో. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా.. వారిలో కొందరి గురించి...



- క.వి.చుసరా
rajusatyanaga@gmail.com

ఖుర్షీద్‌ది పశ్చిమబెంగాల్‌లోని మారుమూల గ్రామం రాణిపూర్. అయినా ఖుర్షీద్‌కు టెక్నాలజీ అంటే చాలా మక్కువ. అదే రంగంలో ఉన్నత విద్యన భ్యసించాడు. కానీ ఉద్యోగాలు ఎక్కడో వస్తున్నాయి. తనున్న గ్రామం చాలా వెనుకబడి ఉన్న ప్రాంతం. తనొక్కడు పట్టణాల్లో దారి వెతుక్కుంటూ వెళ్లిపోవచ్చు కానీ గ్రామంలో చాలా మంది పిల్లలు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారు. డ్రాపౌట్ల సంఖ్య పెరిగిపోతోంది. ఇదంతా తనకెందుకనుకోకుండా గ్రామంలో ఉండిపోయాడు. తన ఇంటి వరండాలోనే పిల్లల్ని పోగు చేసి చదువుపై ఆసక్తి కలిగిస్తున్నాడు. టెక్నాలజీని మ్యాజిక్‌లా కాకుండా చదువులా చూసే విధంగా వారిని ఆకట్టుకుంటున్నాడు. కంప్యూటర్ పాఠాలు కూడా నేర్పే ఖుర్షీద్ ప్రోత్సాహంతో



మరికొందరు విద్యార్థులు సాంకేతిక విద్యలో ఉన్నత చదువులే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆదిత్య కుమార్‌ను లక్నోలో సైకిల్ గురువుగా పిలుస్తారు. ఆదిత్య రోజుకు సుమారు 60 నుంచి 65 కిలోమీటర్లు సైకిలుపై పయనించి మురికివాడల్లోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో అధికారుల దృష్టి సోకని ప్రాంతాల్లో ఆయన నిరంతరం పర్యటిస్తూ ఆదిత్య జ్ఞాన కిరణాలను ప్రసరింపజేస్తున్నాడు. ఆయన సైకిలు వెంటే ఒక

సైకిల్ గురూ

బ్లాక్‌బోర్డునూ మోసుకుపోతారు. దారిలో ఎవరైనా పేదల పిల్లలు కనిపిస్తే వెంటనే వారి ని ఆపి పక్కనే ఏ చెట్టు కిందో, పార్కులోనో ఎక్కడో ఒక చోట నీడ చూసుకుని బోర్డును పెట్టి అక్కడ పాఠాలు ప్రారంభిస్తాడు. బ్లాక్‌బోర్డ్‌ను సైకిల్‌పై తీసుకెళ్లే ఆదిత్య ను చూడగానే పిల్లలు గుర్తు పట్టి ఆపేస్తారు. అంత శ్రద్ధగా ఉంటుంది ఆయన బోధనా విధానం. ఓ ప్రత్యేక సిలబస్ అంటూ ఉండదు. పిల్లల వికాసం ఎంతుందో గ్రహించి అవసరమైన విజ్ఞానాన్నే అందిస్తారు. అక్షరం ముక్కలు నేర్పుతూనే పిల్లలకు బడికి వెళ్లాలనే ఆసక్తిని రగిలిస్తారు. వారిలో ఒక్కడిగా కలిసి పోతూ.. రెండు దశాబ్దాలుగా నుంచి పేద పిల్లలను బడి బాట పట్టిస్తున్న ఆదిత్య సేవ నిస్వార్థమైనది. కళ్లెదుటే పసి బతుకులు బండ పనుల్లో నలిగిపోతున్న విషయం ఆయన్ను కదిలించి తన వంతుగా బ్లాక్‌బోర్డును సైకిలెక్కించుకునేలా చేసింది.

గగన్ దీప్‌సింగ్ రాజస్థాన్‌లోని జైసల్మేరు వాసి. ప్రత్యేక సామర్థ్యమున్న, అవసరాలున్న విద్యార్థులకు చదువు చెబుతున్నారు. ముఖ్యంగా అంధ విద్యార్థులకు చదువును తేలిక చేసేస్తున్నారు. బోధన పరికరాలైన బ్రెయిలర్స్‌ను అక్కడ వాడుకలోకి తెచ్చి విద్యార్థులకు అందిస్తున్నారు. వాటి ద్వారా పాఠాలు

పరీక్షల జ్వరం రాకుండా

రోషిణి ముఖర్జీ ఆన్‌లైన్ అధ్యాపకురాలు. ఎగ్జామ్ ఫియర్.కామ్ అనే పేరిట ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌ను నడుపుతున్నారు. తరగతుల్ని వీడియో క్లిప్‌ల రూపంలో అందుబాటులో ఉంచుతున్నారు. యూట్యూబ్‌లోను అప్‌లోడ్ చేసి ఎక్కడి వారైనా పాఠాల్ని నేర్చుకునేలా ప్రాజెక్ట్ చేపట్టారు. ఆన్‌లైన్ తరగతుల వీడియోలు చాలా స్పష్టంగా ఎంతో ఆసక్తికరంగా మలిచి డౌట్లు క్లియర్ చేస్తుంటారు. ఇలా కొన్నేళ్లుగా ఉచిత వీడియోల్ని అందుబాటులో ఉంచారు. ఒకరోజు ఒక విద్యార్థి ఆమెకు ఫోను చేసి వీడియో పోస్టింగ్స్ వలన తన పరీక్షల్లో చాలా



...నాన్ని నేలకు దించి

...కుంటున్న అంధ విద్యార్థులకు చదువుపై ఆసక్తి ...వవుతోంది. అదే కాదు ఒక్కో విద్యార్థికి ఒక్కో ...లో చదువును వంటబట్టిస్తున్నారు. విద్యార్థుల ...ంబీకులతోను మాట్లాడి చదువు అవసరం ...చి అవగాహన కల్పిస్తున్నారు. సాధారణ ...ర్థులకు పాఠాలు చెప్పడం తేలికే. కానీ ...ంటి వారి కోసం ప్రత్యేకంగా జాతీయ శిక్షణా ...ంలో శిక్షణ తీసుకుని అక్షరాలు దిద్దించే ... ఎంతమందికి ఉంటుంది. అంధ ...ర్థులకు విజ్ఞానంతోపాటు మానసిక వికాసాన్ని, ...ాన్ని పంచుతున్న గగన్ ఆదర్శం ఎంతో ...ంది. మరెంతో ఆదర్శప్రాయమైనది.



...లు సాధించగలిగాననని చెప్పాడట. రెట్టించిన ...ంతో మరింత శ్రద్ధ వహించి విద్యార్థులకు ...ాగపడే విజ్ఞాన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ...తున్నారు.

క్విజ్‌ల్లో సిలబస్

కమలేశ్ జఫాడియా ఎడ్యుసఫర్ అనే వెబ్‌సైట్ ద్వారా పిల్లలకు ఆసక్తిదాయకంగా ఉండే విధంగా సిలబస్‌నూ, అంశాలనూ క్విజ్ మాదిరిగా రూపొందించి పెడతారు. దీనికోసం ఆయన తన గ్రామం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోనున్న సైబర్ కేఫ్‌కు ప్రతిరోజూ పయనిస్తారు. కౌన్ బనేగా కరోడ్‌పతిలా ఆసక్తికరంగా ఉండే ఈ క్విజ్‌లు విద్యార్థుల్ని బాగా ఆకట్టుకుంటున్నాయి. బడిలో తాము చదువుకున్న పాఠాల్లో ఎంత నైపుణ్యం ఉందో వీటి ద్వారా సొంతగా పరీక్షించుకుంటున్నారు. పరీక్షల్లో ప్రశ్నాపత్రంలా కాకుండా ఓ క్విజ్ మాదిరి ఇవ్వడం ద్వారా బట్టీ చదువుల కన్నా జ్ఞానానికే ఎక్కువ మార్కులు పడుతున్నాయి.

విద్యా స్వాతంత్ర్యం కోసం



స్వాతంత్ర్య సమరయోధుడైన సుధాంశు బిశ్వాస్ పోరాటం అక్కడితో ఆగిపోలేదు. విద్యలేనిదే దేశానికి భవిత లేదని బలంగా నమ్మిన ఆయన ఆ తర్వాత తన పోరాటాన్ని విద్యావికాసం కోసం చేస్తున్నారు. 95 ఏళ్ల వయస్సు వచ్చినా కూడా ఇప్పటికీ సుందర్బన్ ప్రాంతాల్లో నాలుగు దశాబ్దాలుగా విద్యా సేవల్ని అందిస్తున్నారు. బాగా అభివృద్ధికి దూరంగా ఉన్న వెనుకబడిన ప్రాంతాల్లో సుమారు 20 ఉచిత పాఠశాలలను స్థాపించి నిర్వహిస్తున్నారు. ఆయన తన లక్ష్య సాధనలో కొన్ని వేల జీవితాలకు అక్షర జ్ఞానాన్ని పెంపొందించారు.



బస్సు బడి

కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా నివాసి ఎఫ్ ఆర్ జులియన్. ఆయన ఒక పాఠశాలను నిర్వహిస్తున్నారు. కాదు కాదు నడుపుతున్నారు. ఎందుకంటే ఆయన నిర్వహిస్తోన్న డాన్ బాస్కో ఇన్‌స్టిట్యూషన్‌ని ఒక బస్సులోనే ఏర్పాటు చేసేశారు. అందులో చాలా కుర్చీలు, బల్లలు, ల్యాప్‌టాప్‌లు. ఒక స్కూల్లో ఏమేమి అవసరమో అవన్నీ అందులోనే పొందుపరిచారు. కాకపోతే ఈ విజ్ఞాన బస్సు రోడ్డు మీద విహరిస్తుంటుంది. దీనికి ఇంకో ప్రత్యేకత ఉంది. అదేమంటే వీటి నిర్వహణకు అవసరమయ్యే విద్యుత్‌ని సోలార్ ప్యానల్ నుంచి పొందుతారు. బస్సు పైభాగంలో సోలార్ ప్యానల్స్‌ను అమర్చారు. ఇందులో సుమారు 20 బ్యాచులకు శిక్షణనిస్తున్నారు. అది కూడా ఉచితంగానే! 2012 జనవరిలో ప్రారంభించిన ఈ బస్సు బడి ఇప్పటి వరకూ సుమారు 2000 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇచ్చారు.

పార్కులే విద్యాలయాలు



న్యూఢిల్లీ దగ్గర్లోని మదాన్‌పూర్ గ్రామపరిధి లోని ప్రాంతాల్లో ఉన్న నిరుపేద విద్యార్థుల ను పోగేసి వారికి ఓనమాలు నేర్పిస్తున్నారు 80 ఏళ్ల విమ్లా కౌర్. 20 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ విద్యాబోధన నేటికీ కొనసాగుతోంది. నిరుపేద విద్యార్థులను సరితా విహార్ ప్రాంతానికి తీసుకొచ్చారు. అక్కడ సరైన భవనం లేదు. అక్కడున్న పార్కులే వారికి విద్యాలయాలయ్యాయి. ఆమె ఒక పార్కు నుంచి మరో పార్కుకు మార్చుతూ తన విద్యా బోధనను కొనసాగిస్తున్నారు. ఇప్పటికి ఆమెకు ఒక చిన్న భవంతి దొరికింది. అందులో ప్రస్తుతానికి రెండో తరగతి వరకు విద్యార్థులకు తరగతులు నడుపుతున్నారు.

'సామాజిక' గుహ

గుహ చాలా అందంగా
ఉంటుంది
రంగు రంగుల విద్యుద్దీప
కాంతులతో
నీ కోసమే
అలంకరించినట్టుంటుంది
నీకు తెలియని
ఆగంతకులెవరో
నీలోకి చొరబడటానికి
ప్రవేశ ద్వారంలా అది ఉంటుంది
కాంతి వలయంలోకి ఒక శలభంలా
సుతి మెత్తగా ప్రవేశిస్తావు నీవు
నువ్వెటు చూస్తే అటు
ఒక అతి సుందర లోకం
నీ కోసం నువ్వు నిర్మించుకున్నట్టే ఉంటుంది
ఆట మొదలవుతుంది
నీ మనసును పసిగట్టే కుక్కలు
నీ మాంసాన్ని కొల్లగొట్టే రాబందులు
సాయం చేస్తామంటూ చేయందిస్తాయి
చేయి కింద నిను బంధించే ఉచ్చుంటుంది
నిను మాటల మాయాలోకంలోకి దించేస్తాయి
నువ్వు అతిలోక సుందరివవుతావు
నీ మనసు ఉప్పొంగుతుంది
అదే కావాలి వాడికి
మనసు పేరు చెప్పి
నీ శరీరపు కొలతలు తీస్తాడు
సీతాకోకచిలుకలా
నీ భుజం మీద వాలుతాడు
రాబందులా నిన్ను పొడుచుకు తింటున్న
స్పృహే ఉండదు నీకు
ఊబిలో దిగబడిపోతావు నీవు
లక్షణమైన నీ ఊహల్ని, కలల్ని
ఫొటోలు తీసి పోస్ట్ చేస్తావు
లైకుల్ని చూసుకుని మళ్లీ ఉప్పొంగుతావు మత్తిల్లుతావు
ఈ సారి నీ శరీరం కింద
మెత్తని కోత మొదలవుతుంది
కళ్లు తెరిచే సరికి
నువ్వూ నీలాంటి మరికొందరు
గుహ ముందు శలభాల్లా రాలి పడి వుంటారు
వేట ముగించుకున్న మేకవన్నె పులులూ గోముఖ వ్యాఘ్రాలూ
పేరూ అడ్రసు మార్చుకుని
గుహ నుండి నిష్క్రమిస్తాయి
సామాజిక మాధ్యమాల రకరకాల పేర్లతో
మరో గుహ మరింత అందంగా ముస్తాబవుతుంది
నీలాంటి మరికొన్ని శలభాల్ని ఆకర్షిస్తూ...!!

- చిత్తలూరి
9133832246

కవిత్వమ్

నాలుగో సింహం

జాతీయ చిహ్నంలో
గాడితప్పిన పాలనకు నిరసనగా
నాలుగో సింహం ముఖం చాటేసింది
రెండు వేళ్ల విక్టరీ సంకేతం
ముందు భాగం ప్రకాశమై
నీతి తప్పిన వెనక భాగం నల్లనైంది!
అమావాస్యగా మారిన పున్నమిని చూసి
తప్పెక్కడ దొర్లిందోనని
పంచాంగాల్ని క్యాలండర్లని
సిద్ధాంతులు ముందేసుకు కూర్చున్నారు
సముద్రం చెరువుగా మారి
బాల్యం దాటని బాలలందరూ
అవలీలగా ఈదుతున్నారు
నది పంట కాల్వ రూపెత్తి
ప్రయాణీకులు ఒక్క అంగలో
అనాయాసంగా దాటుతున్నారు
ఆక్రమణ కేవీ అనర్హం కావు
బలవంతుడి కేవీ అసాధ్యాలు లేవు!
పిడికిట యిమిడిన ఆకాశం
ఒకడి జేబులో దూరి దాక్కుంది
చాపలా చుట్టిన భూమి
ఒకడి భుజంపై పడుకుంది
వాహనాలపై కూలిజనం
ముడిసరుకులా తరలి పోతున్నారు
పంచదార చిలకల్ని మించి
మధురంగా ఉపన్యాసం సాగుతోంది
చరిచిన చప్పట్లు కొండను తాకి
తిరుగు ముఖం పట్టాయి
వాగ్దానాల వర్షం కుండపోతైంది!
అర ఎకరం పాసుపుస్తకం ఎక్కటానికి
అర్ధ సంవత్సరంగా తపస్సు చేస్తూవుంది
మువ్వన్నెల జెండా రంగుల నేపథ్యాన్ని
పాఠ్యగ్రంథం చదివిస్తూవుంది
పాలించే ప్రభుత్వం పతాకానికి
సొంత నేపథ్యం జోడించింది
ఆరు ఇంటూ ఆరు ముప్పయ్యారు
అన్నవాడి నోరునొక్కి
అరవై ఆరు అనమంటూంది!
పసిబిడ్డ నవ్వు పాల నురగలా
ధవళ వర్ణమైతే
తల్లి నవ్వు మసి బారిన పాత్రను
మరపిస్తూ వుంది
భూత వర్తమానాలు భవిష్యత్తుకు
ముక్కుతాడేసి లాగుతున్నాయి

-అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

ప్రత్యేకం



మార్కెట్‌ల వద్ద ట్రాఫిక్ కూడళ్లలో ఎక్కడి నుండో అకస్మాత్తుగా కొందరు చిన్నారులు పరిగెత్తుకొచ్చి కారు అద్దాలు తుడుస్తూ, షూ పాలిష్ చేస్తామని బతిమలాడుతుండే దృశ్యాలు మనకి నిత్యం కనిపిస్తుంటాయి. మనలో చాలా మంది వారిని పట్టించుకోకుండా వెళ్లిపోతుంటారు. పొట్ట కూటి కోసం చేయిచాచి అడుక్కునే పిల్లలు కొందరైతే, చిన్న చిన్న పనులు చేసి సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచే వారు మరికొందరు. అలాంటి వారందర్నీ ఆప్యాయంగా పలకరించడమే కాదు హ్యాపీ బర్త్‌డే భారత్ అనే సంస్థను స్థాపించి వీధి బాలలకి పుట్టిన రోజు వేడుకల్ని నిర్వహిస్తూ వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్నాడు ఢిల్లీకి చెందిన అభిజిత్.

వీధి బిడ్డకు పుట్టినరోజు

ఓ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారు ఆగడంతో ఎక్కడి నుంచో కొందరు చిన్నారులు అభిజిత్ (31) కారు అద్దం దగ్గరి కొచ్చి చేయిచాచి అడుగుతూ కనిపించారు. కార్ విండో తెరిచేసరికి కొందరు వీధి బాలలు ఓ వ్యక్తి తెచ్చి పడేసిన చెత్త నుండి ఓ ఖాళీ కేక్ బాక్స్‌ను తీసి కొన్ని బర్త్‌డే టోపీలను ధరించి ఉత్తుత్తి బర్త్‌డే వేడుకను జరుపుకుంటున్న ఆ దృశ్యం అభిజిత్ కళ్లుచెమర్చింది. గ్రీన్ సిగ్నల్ పడడంతో అక్కడి నుండి తమ జీవన పయనానికి ఎవరికి వారు ముందుకు సాగినా ఆ దృశ్యం అభిత్ మనసుని కలచి వేసింది. మార్కెటింగ్ రంగంలో స్థిరపడిన అభిజిత్ వీధి బాలలకి, మురికి వాడల్లో నివసించే చిన్నారులకి పుట్టిన రోజు జరపాలనుకున్న తన అభిప్రాయాన్ని ట్విటర్‌లో పోస్ట్ చేయడంతో ఎంతో మంది సానుకూలంగా స్పందించారు. అలాంటి వారందరితో ఫేస్ బుక్ గ్రూప్‌ని తయారు చేశాడు. అభిజిత్ ఆలోచన ద్వారా పుట్టుకొచ్చిన ఆ వేడుకే 'హాపీబర్త్‌డే భారత్'. ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో తొలి సమావేశాన్ని ఏర్పరుచుకున్న 15 మంది జట్టు సభ్యులకు పుట్టిన రోజు వేడుకల్ని ఎలా నిర్వహించాలనే దానికన్నా డబ్బు ఎలా సేకరించాలన్నదే పెద్ద సమస్య అయ్యింది. జట్టు సభ్యులు ఒక్కొక్కరూ 500 రూపాయల్ని ఇచ్చేందుకు ముందుకు రావడంతో 2015లో 50 మంది వీధి బాలలతో హ్యాపి బర్త్‌డే భారత్ తొలి పుట్టిన రోజు వేడుకల్ని నిర్వహించింది.

పార్కులు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, ఖాళీ ప్రదేశాలు వేదికలుగా పుట్టిన రోజు వేడుకల్ని నిర్వహిస్తుంటారు. వీధి బాలలు, యాచకులుగా మారిన పిల్లలతో పాటు రోడ్లపై చిన్న చిన్న వస్తువులు అమ్ముతూ కనిపించే పిల్లలందరికీ పుట్టిన రోజు వేడుకని నిర్వహిస్తారు. ప్రతి వారం నిర్వహించే పుట్టిన రోజు వేడుకకు ముందుగా ఎంపిక చేసుకున్న ప్రదేశాన్ని జట్టు సభులందరూ కలిసి రంగు రంగుల కాగితాలతో అలంకరిస్తారు. భారత్ అని రాసున్న కేక్ కట్ చేయించడంతో పాటు క్విజ్, పజిల్ సాల్వింగ్, కథలు చెప్పడం వంటి అనేక పోటీలని నిర్వహిస్తారు. ఉత్సాహపరిచే పాటలకి చిన్నారులతో కలిసి స్టెప్పులేస్తూ వారిని ఆహ్లాద పరుస్తుంటారు. బట్టలు, ఆటవస్తువులు, చెప్పులు, పుస్తకాలు, వాచీలు రకరకాల వస్తువుల్ని పుట్టినరోజు కానుకలుగా అందిస్తారు జట్టు సభ్యులు. కొన్ని సార్లు సభ్యులు కానుకలందించేందుకు ముందుకొస్తే కొన్ని సందర్భాల్లో పిల్లలే తమకు కావాల్సిన వస్తువుల్ని కోరుకుంటారు. ఒక సారి ఢిల్లీలో నిర్వహించిన ఓ పుట్టిన రోజు వేడుకకకి ఒక పిల్లాడి తల్లి దండ్రులు కూడా హాజరయ్యారు. తనకి పుట్టిన రోజు కానుకగా కుటుంబానికి వారానికి సరిపడా ఆహారపర్థాలు అందించాల్సిం దిగా ఆ చిన్నారి కోరడంతో వారికి ఆహారప దార్థాలని అందించారు జట్టు సభ్యులు.

అభిజిత్





‘దేవుడు’ సచ్చిండు కానీ...!

శేష చంద్ర
9440581463



కథ

ఆ పల్లె నిద్ర మత్తులో జోగుతున్న వేళ...గాలికి చెట్లు విరబోసుకొన్న జుత్తులా ఊగుతున్నాయి. అది చూసి భయపడి వణుకుతున్నట్లు వెలుగుతూ ఆరిపోతున్నాయి వీధి దీపాలు. పున్నమి చంద్రుడ్ని పలుచని తెల్లని మేఘాలు కమ్ముకోవడంతో అటు చీకటి ఇటు వెలుతురు లేక మసక మసగ్గా ఉంది ఊరంతా. ఊరి చుట్టూ ఉన్న కంప చెట్లల్లోంచి కీచురాళ్ల శబ్దం.. ఆ పక్కనే చెరువుల్లోంచి కప్పల బెక బెకలు వినవస్తున్నాయి. అవేమి పట్టించుకోకుండా పల్లె నిద్రమత్తులో జోగుతూనే ఉంది. ఆలాంటి వాతావరణంలో ఉన్నట్లుండి మార్పు రాసాగింది. తెల్లని మేఘాలు నల్లబడిపోసాగాయి. చంద్రుడు వాటి వెనక కనుమరుగయ్యాడు. మసక చీకటి కటిక చీకటిగా మారిపోయింది. చిరు జల్లులు పడసాగాయి. ఆ చిరు జల్లులకే బైట పడుకున్న ప్రజలు మంచాలెత్తుకొంటూ పిల్లల్ని లేపుతూ, లేవని పిల్లల్ని తిట్టి కొట్టి లేపుతూ, ఏడుస్తున్న పిల్లల్ని సముదాయిస్తూ నిమిషాల మీద అంతా ఇళ్లలోకి వెళ్లి పోయారు.

ఆ సమయంలో ...ఊరి చివర దేవళంలో గొళ్లెం లేని సింహద్వారం గాలికి బార్లా తెరుచుకొని ఉంది. లోపలనున్న అరుగు మీద ఒక గుడ్డి బిచ్చగాడు చింకి చాప మీద అటు ఇటూ పొర్లుతూ తనపై వాలుతున్న దోమల్ని తుండు గుడ్డతో విసురుకొంటుంటే వాడి పక్కనే గోడకానుకొని మరో బిచ్చగాడు చీకట్లోకి చూస్తూ వర్షం వల్ల వచ్చే వింత శబ్దం వింటూ ఏదో ఆలోచిస్తున్నాడు. గుడ్డోడి పేరు గుడ్డోడే. రెండో వాడి పేరు దేవుడు! వాడికి గర్భగుడిలోని దేవుడికి పేరులో తేడా లేదు కానీ, గర్భగుడిలోని దేవుడికి కోట్ల విలువ చేసే కిరీటముంటే, సింహద్వారం వద్దనున్న ఈ దేవుడికి చిరుగుల పంచ తలపాగా! లక్షలు విలువ చేసే పచ్చల హారం ఆయన మెడలో మెరుస్తుంటే... వీడి మెడలోనూ మెరుస్తూ మూర్ఛ రోగి బిల్ల!

నిజానికి ఈ దేవుడికి ఆ పేరు వాని కన్నవాళ్లు పెట్టింది కాదు. అసలు వాళ్లెలా ఉంటారో కూడా వాడికి తెలియదు. వాడివెంటున్న గుడ్డోడికి తెలియదు. మాటలు రాని వయసులో గుడ్డోడికి పెద్ద సంతలో దొరికాడు. దొరికాడన్న దానికన్నా... ఒంటి కన్ను, అవిటి కాలు, మూర్ఛ రోగంతోనున్న వాడ్ని మనసు (?) చంపుకొని వదిలేశారు వాడ్ని కన్న వాళ్లు. సంతలో వెక్కి వెక్కి ఏడుస్తున్నా వాడ్ని గురించి ఎవరు పట్టించుకోకపోతే గుడ్డోడే ఆప్యాయంగా దగ్గరకు తీసి అమ్మా, అయ్యా అయ్యాడు. తనతో పాటు వాడ్ని చూసి జాలిపడి జనాలు తన జోలే నింపుతుండటంతో వాడు తన పాలిటి దేవుడనుకొని వాడికి దేవుడని పేరు పెట్టుకున్నాడు గుడ్డోడు.

వాళ్లిద్దరుండేది దేవళం పక్కనున్న పాడుబడ్డ గుడిసెలో... వర్షం వస్తుందని గుడ్డోడు ముందుగానే పసిగట్టి దేవళం సింహద్వారం లోపల తలవాల్చారిద్దరు. గురకలు పెట్టి నిద్రపోయే గుడ్డోడు ఈ రోజింకా నిద్ర పోకపోవటానికి గల కారణం ఆ ఊరి సర్పంచ్. రెండు రోజుల క్రితం గుడి దగ్గరకొచ్చి గుడ్డోడ్ని పడిపోయిన పాకలో ఉండటం చూసి ‘ఒరేయ్ గుడ్డోడా, రేపిట్నించి ఈ గుడిసెలో ఉండమాకండి. యాడన్నా సెట్టు సేను కిందో ఉండి సావండి. మా్రాజుల్లా కొంపలు కావల్సి వచ్చినాయిరా మీకు. వెదవ నా కొడకల్లారా! దేవుడి కోసం వచ్చే పతోడు మీ ముస్టి దరిద్రం మొకాలు సూడాలా ఏంది, ఈ సారి మళ్లా ఈడ సూసానంటే నా కొడకల్లారా కాళ్లిరగొడ్తా’ అని బెదిరించి వెళ్లాడు.

గుడ్డోడికి ఇది పుట్టినూరు కాకపోయినా పట్టెడన్నానికి కరువు లేదు. ఏ ఇంటి ముందు నిలబడి కేకేసినా ఒక ముద్ద వేసేవాళ్లే కాని లేదు పొమ్మనే వాళ్లు కాదీ ఊరోళ్లు. సర్పంచ్ ఊరు వదిలి పొమ్మనకపోయినా తల దాచుకునేందుకు కొంప లేక ఏ చెట్టు కిందో కాలం వెళ్లదీయాలంటే దిగులుగా ఉంది గుడ్డోడికి.

“ఏందయ్యా ఇంకా కునుకు తీయలా? ఏంది యోచన సేత్తుండామే” అని అడిగాడు దేవుడు.

“ఈడ్నుంచి ఏడకి ఎల్లాలా అనే ఆలోచన సేత్తండారా దేవుడు”.

“యాడికైనా ఎందుకంటా ఎళ్లడం ఈడ ఏమైనాది?” అర్థం కాక అడిగాడు దేవుడు.

“అరే నీకు మతి మరుపు ఎక్కువైనాది. ఆ సర్పంచోడు మనల్ని ఈ గుడిసెలో ఉండొద్దని ఎళ్లి పొమ్మని సెప్పింది మరిసినావా ఏంది? గుడిసెలోనే వద్దనోడు మనల్ని ఈడ సూత్తే సర్మం సీరేయడు”.

"నీవేందయ్య ఉట్టినే బయపడ్తుండావు. ఈ సీకట్లో ఆరెందుకు వస్తరు. అయినా ఆయన గుడిసెలో ఉండదొన్నరు గానీ ఈ యూరు ఇడిసి పొమ్మన్నడా ఏంది?"
"నీకు ఆడి గురించి తెలియదురా. ఆడు సేసేయన్ని ఎదవ పన్లేనంటా. ఈ మద్దెనే మనువు కాని ఆడకూతుర్ని బలవంతం సేసి సెరిసి నాడంట. న్నాయం ఆ పిల్ల కన్నోళ్లను తన మీద పితురీలు చెప్పుండరని సితక బాదించి ఊర్నించి ఎలి ఏపించుండంట. ఆడు సేసే అన్నాయలకి అడ్డు ఆపు లేదంట. ఆడు ఏం సేత్తున్నా అడిగే దైర్యం ఎవడికి లేదంట. ఎవడోని నోరు తెరిసిండంటే ఆడికి ఆ రేతిరికి భూమ్మీద నూకలు సెల్లినట్లేనంట. అట్టాటోడి సూపు మన మీద పడినాదంటే కంపరంగా ఉందిరా దేవుడు".
"ఆడెట్టాంటోడైతే మనకేంటయ్యా! అడుక్కునేటోళ్లం మనల్నేం సేస్తాడేంది".
"నీకు తెలువదురా దేవుడు. అట్టాంటోడి మద్దెనుంటే ఎట్టా తిరిగి ఎట్టా వత్తదో పిల్లకాయవి నీకేంటి ఎరకొ" అని గుడ్డోడేదో ఆలోచన్లో పడ్డాడు. కొద్ది సేపున్న తరువాత దేవుడే అన్నాడు "నీవేం బయపడమాకే ఇక్కడ వరమానం బాగుంది. ఆడి పాపం పండితే ఆ దేవుడే ఆడికి శిచ్చ ఏస్తడు".

ఆ మాట అనగానే పడుకున్న వాడల్లా దిగ్గున లేచి కూర్చుని కోపంగా "యాడండాడురా దేవుడు? దేవుడే ఉంటే అందరం ఆయన బిడ్డలే కందా మనల్ని ఇట్టా గుడ్డోళ్లగా, కుంటోళ్లగా బిచ్చగాళ్లగా పుట్టించడమెందుకు. మంచిగా పట్టిన సేతినిండా డబ్బున్నోడు పాపాలు సేత్తుంటే సూత్తుండటం ఎందుకు? దేవుడనేవోడుంటే నా మాదిర్గా గుడ్డోడన్నాయ్యిండాలా నేకపోతే పిచ్చోడన్నా అయ్యిండాలా. నేక పోతే ఇట్టా జరుగుతుంటే కండ్లు మూసుకొంటాడా? అట్టా కాకపోతే పాపాలు సేసేవోడికి అన్ని సుఖాలియ్యడమేంది? ఏ పాపం సేయనోళ్లం మనల్ని ఇట్టా కట్ట పెట్టడమేంది? పాపాలు సేసేటోళ్లకు సుఖాలిత్తే ఆళ్లకు పాపం సేసినట్టు ఎట్టాతెలుద్ది? భయమెట్టా ఉంటది?" అన్నాడు గుడ్డోడు.

"లేదయ్యా దేవుడు సానా మంచోడని పూజారయ్య సెప్తే ఇనివుండలా నువ్వు! సేసిన పాపాలకు సేసినంత అనుబవించమని దేవుడలా పుట్టిస్త ఉంటడు. ఆ సర్పంచోడు పోయిన జనమలో మన్చి సేసిండేమో అందుకే ఆడ్ని అట్టా పుట్టించుంటడు. అది తెలీక ఆడట్టా పాపం పనులు సేత్తుంటే దేవుడేం సేత్తడు. మనమూ కూసింత పుణ్ణెం సేసిండామేమో అందుకే మడసులుగా పుట్టిండాం. నేకుంటే ఏ పందిగానో కుక్క గానో బరిగొడ్డుగానో పుట్టిండోళ్లం. ఆనక మన్చి సేత్తే వచ్చే జనమలో గొప్పింట్లో పుట్టామేమో ?"
"అరే ఎర్రి నాగన్న! సివుడాగ్నలేందే సీమైనా కుట్టదంటా అని పూజారోడే సెప్తుంటడు గదా! అట్టాంటప్పుడు మన సేత పాపాలు సేయించటమెందుకు? నువు పాపం సేసిండావని సిచ్చేసి ఇట్టా పుట్టించడమెందుకు. అయినా పాపం సేసేటోడికి వచ్చే జనమలో శిచ్చేందిరా? అదేందో ఈ జనమలోనే ఏత్తే ఇంకోడికి బెయం ముంటది గందా. ఆ పూజారయ్య, నువ్వు సెప్పినట్టు మనలాంటి జనమవచ్చినోళ్లు మంచి సేసేదేంది. ఎవడికైనా సాయం సేసేదేంది. పొద్దు పొడిసి కుంకేదాక పతోడి-ముందు సేయి సాపి అడుక్కొంటు.. పెట్టింది తిని అడుకొని బ్రతికేటోళ్లం మనం మెట్టా మంచి సేస్తం. యోచన సేసి మడిసిగా పుట్టిన మనమే ఏమి సేయనేకుంటే ఇక సెట్టు సేమ పంది కుక్క నక్క అయి యాడా యోచన సేస్తయి? ఎట్టా మంచి సేస్తయి? మల్లా వచ్చే జనమలో మంచిగా ఎట్టాగా పుడ్తయి ?" వాడి తర్కానికి దేవుడు మారు మాట్లాడలేక కొద్దిక్షణాలాగి . .

"వాడ్నెందుకు సంపడం.." అంటుండగానే దేవుడు డొక్కలో కత్తితో బలంగా పొడుస్తూ "వీడు బతికాడంటే మనం బోతాం బొక్కలోకి" అన్నాడు. బాధతో గింజుకో సాగాడు దేవుడు. వాడి పెనుగులాటలో సామీ అనే వాడి ముసుగు పక్కకు పోయింది. అదే సమయంలో మెరుపు మెరవటంతో వెలుతుర్లో వాడి ముఖం చూసి పిడుగు పడ్డవాడి మాదిరిగా అయ్యాడు దేవుడు.

"ఎవడో పాపం సేత్తున్నాడని మనమెందుకు వోడి మీద కోపబడాలా? ఉప్పు తిన్నోడు ఊరి సెరువు నీల్లు తాగక తప్పదు. తప్పు సేసి నోడికి శిచ్చ తప్పదు. అన్ని పాపాలు సేసిన సర్పంచోడు మంచానో కుంచానో పడి దిక్కులేని సావు సత్తాడు".

"అట్టా యాడవుతుందిరా పిచ్చినాగన్న. తప్పు సేసేవాడు దర్జాగా రాజోడిలా తిరుగుతుంటడు. వోడ్నే జనాలు దండాలు దస్కాలు పెట్టూ దేవుడ్లా కొలుస్తంటరు." వాడి మాటలను మధ్యలోనే తుంచేస్తు దేవుడేదో చెప్పబోతుంటే "ఇంక నీ వాగుడాపి తొంగో.. నీకు దేవలం పంచన పడి తెలివెక్కువైనాది." అంటూ నిద్రలోకి జారుకొని గురక తీయడం మొదలు పెట్టాడు.
కొద్దిసేపు తరువాత వాన కుండలు గుమ్మరించినట్టు పడుతుండాది. వర్షం శబ్దం వింటూ.. నిద్ర పట్టక గాలి గోపురం పైన మెరుస్తున్న దీపాన్ని చూస్తు ఆలోచిస్తున్నాడు దేవుడు. గోపురం పైన లైటు ఆరిపోవడంతో చిమ్మ చీకటి అలుముకొంది అంతా. చాలా సేపటి వరకు నిద్ర పట్టక అటు ఇటూ దొర్లుతున్న వాడికి ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు ఆ తరువాత ఎవరో మాట్లాడుతున్నట్లు గుస గుసలు వినపడటంతో దేవుడు సీకట్లో ద్వారం ముడుచుకు కూర్చున్నాడు. నడక శబ్దం దేవళం వరకు వచ్చి ఆగిపోయింది. ప్రాణాలు బిగ పట్టుకుని కూర్చుండి పోయాడు. వచ్చిన వాడు మొబైల్లో రెండు మాటలు మెల్లగా మాట్లాడి ఆ తరువాత నెమ్మదిగా చీకట్లో కలిసి పోయాడు. వర్షం పడుతూనే ఉంది. ఉన్నట్లుండి మిరుమిట్లు గొలిపే తెల్లటి మెరుపు! ఆ వెలుతుర్లో నలుగురు మనుషులు వారి చేతిలో ఏవో ఆయుధాలు! మెరుపుతో పాటు వచ్చిన పిడుగు శబ్దానికి ఉలిక్కిపడిన దానికన్నా ఎక్కువ అదిరి పడ్డాడు దేవుడు.

దొంగలా ? దేవుడి నగలు దొంగతనం సేయనొచ్చారా? ఆశ్చర్యం, భయం రెండు ఒక్కసారి వాడ్ని కమ్మేసాయి. అలాగే కన్నార్పకుండా చూస్తుండి పోయాడు. మెరుపు మెరుస్తున్నప్పుడల్లా వాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నారు. ఏం చేయాలో దిక్కుతోచలేదు. 'అయ్యను లేపితే ? అయినా అయ్యను లేపితే ఏం పెయోజనం ? ఆళ్లను సూడలేక పోంగా పెమాదంలో పడ్తడు.' అనుకుని గుడ్డోడ్ని లేపే ప్రయత్నం మానుకొన్నాడు దేవుడు. చీకట్లో ముడుచుకొని పడుకునే వాళ్ళేం చేస్తున్నారో చూడసాగాడు. ముగ్గురు వ్యక్తులు నెమ్మదిగా గర్భగుడి చేరుకుంటుంటే మరొకడు నెమ్మదిగా సింహద్వారం వైపు రాసాగాడు. దేవుడు ప్రాణాలు పైపైనే పోయాయి. వాడు తమని చూసాడేమోనని భయపడ్తూ బిగసకపోయాడు. వాడు సింహ ద్వారం దాటుకొని బైటకి తొంగి చూచి ఎవరు లేరని మరోసారి నిశ్చయించుకుని వాళ్లతో కలిసిపోయాడు. ఆ కొద్దిసేపు ఎలాంటి మెరుపులు రాకపోవడంతో గుడ్డోడ్ని, దేవుడ్ని వాడు చూడలేక పోయాడు.
వాడు వెళ్లి పోయిన శబ్దం దూరమైనంత వరకు ప్రాణాలు బిగపట్టుకొన్న దేవుడు ఆ తరువాత భయం భయంగానే కళ్ళు తెరిచాడు. ఆ నలుగురు గర్భగుడికి చుట్టుకట్టిన ఇనుప కట్టాంజనం చేరుకొని దానికి వేసిన తాళాన్ని తీయడానికి ప్రయత్నించసాగారు. తాళం ఎంత సేపటికి రాక పోవటంతో తన వెంట తెచ్చిన సమ్మెటకు గుడ్డమట్టి బలంగా రెండు సార్లు తాళం కప్పమీద మోదే సరికి శబ్దం కాకుండా తాళం కప్ప ఊడొచ్చింది. వెంటనే వాళ్లు ఒకరి తరువాత ఒకరు లోపలికి నడిచారు. దేవుడు వాళ్లు చేసే పనిని గమనిస్తూనే ఉన్నాడు.

వాళ్ల దేవుడి నగలు దొంగతనం చేయడానికే వచ్చారని తేలిపోవడంతో ఓ వంక భయం మరో వంక ఏం జరుగుతుందోనని ఆతృత పెరిగి పోసాగింది. 'తన నగలను దొంగిలిస్తుంటే సూత్తు దేవుడు ఊరుకొంటాడా? వాళ్లను నెత్తుర కక్కి సచ్చేటట్టు సేయడు! నేక అందరికి సోరకం వొచ్చేటట్టు సేత్తాడోమో ..?' అనుకున్నాడు దేవుడు. వర్షం పడుతూనే ఉంది. చిమ్మ చీకటి ఏమి కనపడలేదు. అప్పుడప్పుడు మెరిసే మెరుపులకు ఉన్నట్లు పట్టపగలైపోతోంది. గర్భగుడి వైపు చూస్తునే మెల్లగా కట్టె చేతికి తీసుకుని అరుగు దిగి శబ్దం కాకుండా భయపడుతూనే బైటికి రెండడగులులేసి ఎవరైనా ఉన్నారేమోనని చూచాడు దేవుడు. ఎవరు కనిపించకపోవడంతో దైర్యం సేసి బైటకెళ్లి ఊరోళ్లను లేపుతా.' అనుకుంటూ గబ గబా కుంటుతూనే పరుగులాంటి నడకతో ముందుకు నడిచాడు.

దేవుడు ఆలా కొద్ది దూరం నడిచాడో లేదో ఎక్కడ్నుంచి వచ్చాడో ఏమో ఒకడు దేవుడు తల మీద ఒక దెబ్బ వేసాడు. దాంతో దేవుడు తల దిమ్మె తిరిగి పోయింది. చేతిలో కట్టె దానింతకు అదే కింద పడిపోయింది. కట్టె ఆసరా లేకపోవడంతో దాంతో పాటు దేవుడు కుప్పకూలిపోయాడు. భయంతో గట్టిగా కేక వేయబోయాడు. కాని కొట్టిన వాడు కింద పడిన దేవుడ్ని ఒకచేత్తో చంక కిరికించుకొని మరో చేత్తో దేవుడి నోట్లో కేక బైటికి రాకుండా నోరు మూసి కుక్క పిల్లను ఈడ్చుకపోయినట్లు దేవళంలోకి ఈడ్చుకపోయాడు. బ్యాగులో దేవుడి నగలు సర్దుతున్న వాళ్ల తన మనిషి ఎవర్నో లాకొస్తుండటం చూసి చేస్తున్న పని ఆపేసి 'ఎవడు వాడు' అన్నారొక్కసారి కీచుగొంతుతో భయపడి పోతూ!

"ఈడెవడో కుంటోడి లాగున్నాడు. ఈడి కత నేను సూసుకొంటాగాని మీ పని బెగినా కానియ్యండి" అన్నాడు దేవుడ్ని ఈడ్చుకవచ్చిన వాడు. మిగతా ఇద్దరు బ్యాగు సర్దుతుంటే మరొకడు మాత్రం చేస్తున్న పని ఆపి టార్చిలైటు దేవుడి ముఖం మీద వేస్తూ "ఇంతకు ముందు ఎవరూ లేరంటివి గదరా! ఇప్పుడీడు యాడ్నించి వచ్చిండు? చెప్పిన పని సరిగా చేసి సావవు కదా! వీడితో పాటు ఇంకో గుడ్డోడుండాలా బైటికెళ్లి సూడు" అని గొణిగాడు కోపంగా. వాడి గొంతు ఎక్కడో విన్నట్లన్పించింది దేవుడికి. అయ్యగూడా ఈళ్లకి సిక్కి పోతాడేమో! అనుకొని బాధ పడసాగాడు.

"ఎవరు లేరు సామీ నేను సూసినప్పుడు. ఇంతకు ముందే వానకు లోపలికి వచ్చి మనల్ని సూసి బైటకి పోతన్నట్టు ఉండాడు. ఒక దెబ్బేసే సరికి నేల కరిచాడు. తెల్లారాందాక తెలివి రాదు." సామీ అనే వాడు ఒక చేత్తో టార్చిలైటు దేవుడి ముఖం మీద వేస్తు మరోచేత్తో జుట్టు పట్టుకొని "చెప్పురా కుంటి నా కొడకా! ఈడ ఏంసేత్తుండావు. నీయెంట ఉండే గుడ్డోడేడి అన్నాడు. దేవుడు మాట్లాడక పోయేసరికి 'నాటకాలాడుతండావురా అని మీద మీద పిడి గుద్దులు గుద్దసాగాడు. దేవుడు బాధ భరించలేక కళ్లు తెరిచాడు. "సెప్పు గుడ్డోడేడి?" మళ్లీ రెట్టించి ఆడిగాడు వాడు. "నాకు తెలివదు సామి. నాను పక్కూరికి పోయిండా. అడుక్కునేకి వచ్చేసరికి సీకటి పడినాది. అయ్య కోసం గుడిసెలో సూత్తే లేడు. యాడికెళ్లిండో ఎరికనేదయ్యా సత్తె పెమాణంగా నాకు తెలవదు."

"మరి కొట్టంలో సావకుండా ఈడికెందుకొచ్చావ్?

"వానకు గుడిసంతా కారిపోతంటే ఈడ తొంగోవాలని వచ్చిన. దేవలంలో సప్పుడు సూసి భయమేసి మళ్లా ఎనక్కి ఎళ్తుంటే ఎవడో కొట్టి ఈడికి ఈడ్చుకొచ్చిండు సామి!" అంటూ చేతులు జోడించాడు.

వాడు దీనంగా ఏడ్వటం చూసి "వీడితో మనకేంది కట్టిపడేస్తే సరి తెల్లారిందాక ఈడ్నే పడిఉంటడు" అన్నాడు దేవుడ్ని ఈడ్చుకొచ్చిన వాడు.

"వీడ్ని కట్టేయడమెందుకు? మనం దేవుడికిచ్చే నరబలి అనుకుంటే పోలా" అన్నాడు వికృతంగా నవ్వుతూ రెడ్డనే వాడు.

"వాడ్నెందుకు సంపడం.." అంటుండగానే దేవుడు డొక్కలో కత్తితో బలంగా పొడుస్తూ "వీడు బతికాడంటే మనం బోతాం బొక్కలోకి" అన్నాడు. బాధతో గింజుకో సాగాడు దేవుడు. వాడి పెనుగులాటలో సామీ అనే వాడి ముసుగు పక్కకు పోయింది. అదే సమయంలో మెరుపు మెరవటంతో వెలుతుర్లో వాడి ముఖం చూసి పిడుగు పడ్డవాడి మాదిరిగా అయ్యాడు దేవుడు. వాడు ఆ ఊరి సర్పంచ్! కుప్పకూలిపోతున్న వాడ్ని మరో పోటు పొడిచి ఓ మూలకు విసిరేసాడు సర్పంచ్. కిందపడ్డ దేవుడు చచ్చినట్లు పడిపోయాడు. వాడి శ్వాస ఆడుతుందో లేదో చూచి దేవుడు చచ్చిపోయాడని నిర్ధారించుకుని దోచుకొన్న నగల్తో చీకట్లో కలిసి పోయారు సర్పంచ్, వాడితో పాటు వచ్చిన వాళ్లు. అంత వరకు బాధను భరిస్తూ అచేతనంగా ఉండిపోయాడు శ్వాస బిగ బట్టి. కాసేపటికి మెల్లగా కళ్లు తెరిచాడు దేవుడు. చిమ్మ చీకటి అప్పుడప్పుడు మెరిసే మెరుపుల్లో గర్భగుడిలో నున్నదేవుడు మసక వెలుతుర్లో ఏమీ జరగనట్లే చిరునవ్వులు చిందిస్తున్నాడు. అది చూసి దేవుడికి తెలియని సత్యం ఏదో తెలిసినట్లన్పించింది.

"దేవుడి మీద భారమేసి వోడ్ని వదిలేత్తే గాల్లో దీపమెట్టి దేవుడా కాపాడన్నట్టు ఉంటాది. అట్టా సేత్తే... ఈ పల్లెకు పట్టిన పీడ యాడ వదల్తది..! నేనే ఏదో ఒకటి సేయాలా. సచ్చిపోతుండానని బాధనేదు కాని ఆడ్ని సర్పంచోడ్ని పట్టియాల. ఈ పల్లెకు పట్టిన పీడనొదిలియ్యాల. కాని బైటకి ఎళ్లను సక్తినేదు. గట్టిగా అరిసినా ఇనపడదెవరికి ఏం సేయాలా?".. అనుకుంటూ.. బలం తెచ్చుకొని లేచి కూర్చున్నాడు దేవుడు. చుట్టు చూచాడు. అప్పుడప్పుడు మెరిసే మెరుపుల్లో... దేవుడి విగ్రహం పక్కనే పాటలు పెట్టే పెట్టె, దాని పక్కనే మైకు.... దాన్ని చూసే సరికి దేవుడికి పోయే ప్రాణం తిరిగి వచ్చినట్టైంది. గోడవారనానుకుని భరించలేని నొప్పిని లెక్కచేయకుండా పాములాగా పాకుతూ మైకు దగ్గరికి వచ్చాడు. లేని శక్తిని వంట్లోకి తెచ్చుకుని లేచి చేతికందిన స్విచ్‌లన్ని వత్తేసాడు. మైకు శబ్దం చేయడంతో "దేవలంలో దొంగలు పడ్నారు. ఈ ఊరి సర్పంచోడు దొంగలతో సేయి కలిపి దేవుడి నగలు దోచేసుక పోతుండారు లెయ్యండి." అని గట్టిగా అరవడం మెదలు పెట్టాడు.

అరుస్తూనే ఉన్నాడు. ఊరులో పిల్లా పాప పెద్దాచిన్న అంతా నిద్రలేచేంత వరకు అరుస్తూనే ఉన్నాడు.. చెవులు చిల్లులు పడేలా ... ఊరులోని ప్రజలు నిద్రమత్తు వదిలేంత వరకు. అరుస్తునే ఉన్నాడు దేవుడు తను చచ్చేంత వరకు. ఆ అరుపులకు ఊరు ఊరంతా నిద్రలేచింది. లేచిన జనాలను చూచి వాన భయపడి ఆగిపోయింది. కరెంటు లైట్లతో, టార్చిలైట్లతో చీకటి పారిపోగా ఊరంతా పట్ట పగలైంది. జనం జాతరకొచ్చినట్లు గుంపులు గుంపులుగా దేవళంలోకి రాసాగారు. ఈ ఊరికి సర్పంచ్ పీడా విరగడయ్యేలా చేసానన్న తృప్తితో, రక్తపు మడుగులో చావు అంచున ఉన్నా కూడ సంతోషపడ్తున్న దేవుడ్ని .. మరోపక్క నగలన్ని వలుచుకపోగా చిరునవ్వులు చిందిస్తున్న ఆభయహస్తధారి దేవుడు బోసిపోవడం చూసి జనం కోపంతో రగిలిపోయారు.

జనానికి ఆగ్రహం రాకుండా ఉండాలే కాని వస్తే దాని ముందు నిలబడటం ఎవరికి సాధ్యం! ఊరి బైట పారిపోతున్న దొంగల్తో పాటు, దేవుడి నగలను దాచేస్తూ ఇంట్లోనే దొరికిన సర్పంచును గుంపులు గుంపులుగా మీద పడి చితకబాదారు. దాంతో సర్పంచ్ పరువు(?)తో పాటు ప్రాణం కూడా పోయింది.

గుడ్డోడికి దేవుడి అరుపుల్తో మెలుకవ వచ్చింది. ఏదో ఘోరం జరిగిపోయిందని మనసు కీడు శంకిస్తుంటే గుంపులుగా వస్తున్న జనాలకడ్డుబడి 'ఏమైనాది సామి?' అని ఆరాట పడుతూ అడిగాడు. జనం చెప్పింది విని 'అయ్యో నా దేవుడు సచ్చిండా!' అంటూ తల బాదుకోసాగాడు గుడ్డోడు. వాడి ఏడ్పు చూసి.. "బాధపడకురా నీ దేవుడు సచ్చిండు కానీ... ఆడు సచ్చిపోతూ ఈ ఊరికి పట్టిన పీడని వదిలించిండు" అని జనాలు మెచ్చుకుంటుంటే.. లోలోపల కుమిలి పోతూ బైటికి పిచ్చోడిలా నవ్వసాగాడు గుడ్డోడు!

✦

ఆత్మీయులై ఆత్మహత్యలాపండి



ఏటా 8 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంటే రోజుకు 3000 మంది... ప్రతి 40 క్షణాలకు ఓ బలవన్మరణం. ఆత్మహత్యాయత్నం చేసిన వారి సంఖ్యకు లెక్కలేదు. ప్రతి మూడు క్షణాలకు యత్నాలు జరుగుతున్నాయి.

✧ హత్య కాబడతున్న వారి కన్నా, యుద్ధాల్లో మరణిస్తున్న వారి కన్నా ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువ.

✧ 15-29 ఏళ్ల మధ్య యువత మరణాలకు రెండో ప్రధాన కారణమిదే.

ఇవి కొన్ని లక్షణాలు

డిప్రెషనే ఆత్మహత్యలకు ప్రధాన కారణం.

✧ పదే పదే ఆత్మహత్య గురించి ఆలోచించడం, రాయడం, మాట్లాడటం, ప్లాన్‌లు వేసుకోవడం.

✧ మత్తుకు బానిసవ్వడం

✧ విరక్తి భావాలు

✧ ఆందోళన, ఉద్రేకపూరితంగా ఉండటం, నిద్ర లేమి లేదా ఎప్పుడూ నిద్రలో ఉండటం

✧ తనకు తానే బంధీగా మారడం

✧ నిరాశ

✧ స్నేహితులకు, కుటుంబానికి, సమాజానికి దూరం పెంచుకోవడం

✧ కోపం, ఆవేశం, పగబట్టినట్టు ప్రవర్తించడం

✧ దేన్నీ పట్టించుకోకపోవడం

✧ ప్రవర్తనలో ఉన్నట్టుండి మార్పులు

(అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ సూసైడాలజీ)



✧ 75 శాతం ఆత్మహత్యలు పేద, మధ్య తరగతి ఆదాయ దేశాల్లోనే కనిపిస్తున్నాయి.

✧ ఒక ఆత్మహత్య మరో ఆరుగురి జీవితాలపై ప్రభావం చూపిస్తుంది. ప్రసార మాధ్యమాల ద్వారా పదే పదే ఉద్వేగభరిత ఆత్మహత్య కథనాలను చూసినవారు ప్రేరేపితులవుతున్నారని కొన్ని పరిశోధనల్లో తేలింది.

✧ ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం చేసినవారు మరోసారి చేసుకునే అవకాశం చాలా ఎక్కువ. అందుకే వారితో మరింత మెరుగైన సంబంధాల్ని కలిగి ఉండాలి. తరచూ మాట్లాడుతుండాలి.

✧ 'కనెక్ట్, కమ్యూనికేట్, కేర్' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు. కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు బలంగా ఉన్న వారిలో ఆత్మహత్య భావనలు తక్కువ. అందుకే విషమ పరిస్థితులను ఎదుర్కునే వారితో కనెక్ట్ అయ్యి తరచూ వారితో మాట్లాడుతూ శ్రద్ధ తీసుకుంటే ఆత్మహత్య చేసుకోవాలన్న తలపు రాదు. అందుకే ఈ ఏడాది మానవ సంబంధాల పటిష్టతనే నినాదంగా తీసుకున్నారు.

✧

ఎప్పటికప్పుడు కొత్త లక్ష్యాలను ఏర్పరచుకోవడం, కొత్త విషయాలను ప్రయత్నించడం వంటివి కూడా మరో ఆలోచనకు ఆస్కారం ఇవ్వవు.

✧ డిప్రెషన్‌లో ఉన్నవారిని కదిపి వారు పూర్తిగా తమ సమస్యల్ని మాటల్లో పంచుకునేంత వరకు శ్రద్ధగా వినగలగాలి. ఏదో తెలియని భరోసా కలిగిందనే భావన వారిలో వచ్చేలా ప్రయత్నించాలి. వారిని ఒంటరిగా వదిలేయకూడదు.

✧ అంతా బాగవుతుంది అని చెప్పడం, ఎదుటి వారి సమస్యల్ని తేలిగ్గా తీసుకోవడం, కొట్టిపారేయడం, సీరియస్ సమస్యలకు కుదరని పరిష్కారాల గురించి చర్చించి లాభం లేదు. ఆ వ్యక్తి తీవ్రంగా భావించే సమస్యకు అంతే స్థాయిలో వారి బాధను అర్థం చేసుకుని స్పందిస్తూ జాగ్రత్తగా మాట్లాడాలి. వారిని వెంటనే సైకాలజిస్టుల వద్దకు కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లాలి.

✧ అందరికీ, అన్ని సమస్యలకు ఒకే విధానం పనిచేయదు. అందుకే సాధ్యమైనంత వరకు వైద్యుల సాయం తీసుకోవాలి.

ఆలోచింపచేసే కథలు

ఈ కథలు కాలక్షేపానికి కాదు! వీటిని చదివితే కోరికలు గుర్రాలు కావు. క్షణికావేశపు వెల్లువలో మస్తిష్కాలను మత్తులో ముంచవు. దానికి భిన్నంగా ఆలోచనలను రేకెత్తిస్తాయి. మెదడుకు పదును పెడతాయి. కదిలిస్తాయి. అలజడి సృష్టిస్తాయి. కదనరంగానికి కాకపోయినా చుట్టూ ఉన్న సమాజంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ఏదో ఒకటి చేయాలన్న తపనను కలిగిస్తాయి. విశాఖలో జరిగిన సిపిఎం 21వ మహాసభల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎంపికైన కథలను ప్రజాశక్తి బుక్‌హౌస్ 'కదలిక' కథలు పేరిట ఒక సంకలనంగా తీసుకువచ్చింది. 20 కథల ఈ సంకలనంలో ప్రతి కథా పాఠకులను ఎంతో కొంత మేర ప్రభావితం చేస్తుంది. మన కళ్లముందే జరుగుతున్న పరిణామాలకు కారణా లేమి టో విశ్లేషిస్తుంది. ప్రపంచీకరణ వెలుగులో మసిబారి పోతున్న సామాన్యుల బతుకులను, ఆ సమస్యల పరిష్కారాలను ఆవిష్కరిస్తుంది. విద్యారంగంలోని లోపాలను ఎత్తిచూపడంతో ప్రారంభమయ్యే మొదటి కథ కదలిక నుండి, 'నేనవరో కాదు దొరా! మీ ఊరి తుపాకి రాముని కొడుకు పుల్లయ్యను... అంటే ఆనాటి పుల్లిగాన్నే నేటి పూలేరావును..' అంటూ ముగిసే చివరి కథ

పుస్తకం : కదలిక కథలు
వెల : 150 రూపాయలు
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

సుడిగాలి వరకు అన్నింటిదీ ఇదే ఒరవడే! 'బజారు ఉలిక్కిపడింది. రోడ్లమీద, దుకాణాల్లో ఉన్న జనమంతా తలలు తిప్పి చూశారు' అంటూ సింహప్రసాద్ రాసిన 'కదలిక' కథ ప్రారంభమవు తుంది. ఇంతకూ వారిని అంతలా ఉలిక్కిపడేలా చేసిందేమిటో తెలుసా... విద్యార్థులు...తొమ్మిదేళ్ల నుండి పదహారేళ్లదాకా ఉన్న పిల్లలు... ' విద్య మా హక్కు, మేం చదువుకుంటాం' అంటూ వారు చేసిన నినాదాలు. వారికి నాయకత్వం వహించిన ఒక అమ్మాయి! ఫీజు రీయింబర్స్‌మెంట్ నుండి పిజి వరకు ఉచిత చదువులు చెప్పిస్తున్నామని ప్రభు త్వాలు ఒక పక్క ఊదరగొడుతుంటే, పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం విద్యార్థులు రోడ్డెక్కుతున్న వైరుధ్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది. చదువుకునే విద్యార్థులు, పుస్తకాలను పక్కనబెట్టి రోడెక్కితేకానీ సమస్యను పరిష్కరించని ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని, పోరాడితే తప్ప సమస్యలకు పరిష్కారం లభించదన్న వాస్తవాన్ని ఈ కథ కళ్లెదుట నిలుపుతుంది. పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'చీమాచీమా ఎందుకు పుట్టావ్' కథ ప్రభుత్వ యంత్రాంగంలో పెరిగిపోతున్న ప్రైవేటు రంగ పలుకుబడిని, పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల తీరును, ఉద్యోగుల బాధ్యతారాహిత్యాన్ని వ్యంగ్య ధోరణిలో వివరిస్తుంది. పోచయ్య అనే దళితుణి భార్య మరణం... దానికి కారణమేమిటో తెలుసుకోవడం కథా వస్తువు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం తుళ్లూరులో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక మార్పులను, వాటి పర్యావసాలను ఎమ్వీరామిరెడ్డి రాసిన 'రేపటిబీడు' ఆవిష్కరిస్తుంది. మిగిలిన కథలు, వాటిలో ఆవిష్కృతమైన కథా వస్తువులు చెప్పడం కన్నా చదివి, అవి కలిగించే అనుభూతిని అనుభవించడమే బావుంటుంది. వర్తమాన సజీవ అంశాలను స్పృశించి, కదిలించే కథలుగా వాటిని మలిచిన రచయితలందరికీ పేరుపేరున ధన్యవాదాలు. వీటిని పుస్తక రూపంలో మలచిన ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు అభినందనలు.

- వి.రాజగోపాల్

కళింగాంధ్ర ముఖ చిత్రం

ఆధునిక వచన కవిత రెక్కలుగా, హైకూలుగా, నానీలుగా విభిన్న రూపాల్లో తెలుగు పాఠకులను అలరిస్తూనే వుంది. 'కళింగ నానీలు' వర్తమాన అస మానతలపై, అన్యాయాలపై ఝుళిపించిన కొరడా దెబ్బలు. గుళ్లలో అమ్మవారిని పూజిస్తారు. ఇళ్లలో అమ్మలు ఎంత చాకిరీ చేసినా వారి శ్రమకు గుర్తింపు, ప్రతిఫలం వుండదు. ప్రభుత్వం కూడా స్త్రీలు ఇంట్లో చేసే శ్రామిక శక్తికి ప్రతిఫలం లెక్కగట్టాలని అంది. దీన్నే 'ఆలయంలో బొమ్మకు దండాలు బీట్లు, ఇంట్లో వున్న అమ్మకు చీవాట్లు' అని అమ్మల వాస్తవ పరిస్థితిని పదునుగా వ్యాఖ్యానిస్తారు కవి.

ఈనాడు ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పేరిట పేదల భూములు స్వాధీనం చేసుకుంటోంది. నాలుగ్గింజలు పండే భూమిని కోల్పోయి పేదలు నానా పాట్లు పడుతున్నారు. దీన్నే గుండెలు బాదుకుంటూ 'తప్పెట గుళ్ళు కాదు సర్కారు వారు భూమి లాక్కున్నారు' అని ప్రభుత్వ పనితీరుని ఎండగడుతున్నారు? కళింగ సీమలో తప్పెట గుళ్ళు పేరొందిన జానపద కళ. ఈ కళల్లో కళాకారులు

కళింగ నానీలు
రచన: డా.చింతకింద శ్రీనివాసరావు
వెల:60/-
పేజీలు:63
ప్రతులకు: శ్రీనిజ ప్రచురణలు, రవీంద్ర నగర్, ఓల్డ్‌డైరీ ఫాం, విశాఖపట్టణం.

గుండెల మీద కొట్టుకుంటూ రకరకాల విన్యాసాలతో ప్రదర్శనలిస్తారు. దీనికి ప్రభుత్వం వారు భూమిలాక్కోవడానికి అన్వయించి భూమి లాక్కున్నందుకు ప్రజలు బాధపడుతూ గుండెలు బాదుకుంటున్నారు అని సునిశితంగా విమర్శిస్తారు. ఈమధ్య విశాఖ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా చేస్తానని ప్రభుత్వం ప్రకటించింది. నగరాన్ని సుందరీకరించే మార్గంలో కొండల మీద వుండే సామాన్య జనం ఇళ్ళని పీకి పారేస్తారేమోనని 'స్మార్ట్ సిటీ అంటున్నపుడల్లా నాదారి దీపాలు రెపరెప' అని పేదల బాధలను అక్షర చిత్రాల్లో ఆవిష్కరిస్తారు. ప్రపంచీకరణ వలన దేశీయ పానీయాల మీద అభిరుచి తగ్గిపోయి కూల్‌డ్రింకులకు బానిస అవుతున్నాడు మనిషి. బహుళ జాతి కంపెనీలు మన ప్రాంతంలోని భూగర్భంలోని జలాలను తోడుకుని, ఇక్కడి నీళ్లతో వ్యాపారం చేసి అపరిమితమైన లాభాలు సంపాదించి ఇక్కడి ప్రజలను కూల్‌డ్రింకులకు బానిసలుగా చేసుకోవడాన్ని 'ఏస్కో కోకో కోలా, ఏనాడన్నాడో ఆరుద్ర కోలా దెబ్బకి కొబ్బరి బొండాం ఢాం' అని కోకోకోలా దెబ్బకు కొబ్బరిబోండాలు ఎలా చిరునామా లేకుండా పోయాయో వర్ణిస్తారు. రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్య ప్రజల విషాద చిత్రాలు, చేపలు పడితే గానీ కడుపు నిండని జాలరి బతుకులు బాక్సైటు గనుల తవ్వకం వలన సహజసంపదలు కోల్పోతున్న ఆదివాసీల సంక్షుభిత జీవిత చిత్రాలు మనకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి.

- మందరపు హైమావతి

పూర్ణం కుడుములు



కావాల్సిన పదార్థాలు

శెనగపప్పు-3/4 కప్పు
బెల్లం-1కప్పు
కొబ్బరి తురుము-1/2 కప్పు
బియ్యప్పిండి-1 1/2 కప్పు
యాలకుల పొడి-1 టేబుల్ స్పూన్
ఉప్పు-చిటికెడు
నీరు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా పచ్చి సెనగపప్పును శుభ్రంగా కడిగి కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చేవరకూ ఉడికించుకోవాలి. కొద్దిగా చల్లారాక ఉడికించిన పప్పులో ఉన్న నీటిని తొలగించాలి. ఒక ప్లేట్‌లో ఉంచి ఆరనివ్వాలి. ఇప్పుడు ఒక మంద పాటి పాత్ర తీసుకుని స్టౌపై ఉంచి అందులో పొడిచేసి పెట్టుకున్న బెల్లం, కొద్దిగా నీరు పోసి పాకం వచ్చే వరకు కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో ఉడికించిన సెనగపప్పు, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి కలిపి పది నిమిషాలపాటు ఉడకనివ్వాలి. ఈ మిశ్రమం గట్టి పడ్డాక స్టౌపై నుండి దించేయాలి. చల్లారిన తర్వాత ఉండలుగా చేసి ఒక ప్లేట్‌లో పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లో కొద్దిగా నెయ్యి, ఉప్పు, బియ్యప్పిండి తీసుకుని గోరువెచ్చని నీటితో బాగా కలుపుకోవాలి. ఇప్పుడు చేతికి నూనె రాసుకుని బియ్యప్పిండి మిశ్రమాన్ని పల్చటి బిళ్లలుగా చేసుకోవాలి. వాటిలో ఉడికించిన సెనగపిండి ఉండల్ని వుంచి చివర్లు గట్టిగా రోల్ చేసుకోవాలి. ఇడ్లీ తయారుచేసే ప్లేట్స్‌లో ఈ ఉండల్ని పెట్టి పదిహేను నిమిషాల పాటు ఉడికించుకోవాలి. బైటికి తీసి చల్లారిన తర్వాత సర్వింగ్ ప్లేట్స్‌లో పూర్ణం కుడుముల్ని ఉంచి అతిథులకందించండి.

ఖర్జూర రోల్స్

కావాల్సిన పదార్థాలు

ఖర్జూరాలు- 1/2 కేజీ
పాలు-1 లీటరు
డ్రైఫ్రూట్స్-1/2 కప్పు
నెయ్యి-2 టేబుల్ స్పూన్లు
కొబ్బరి పొడి-3 టేబుల్ స్పూన్లు
వాల్ నట్స్- 4

తయారుచేసే విధానం

ముందుగా ఖర్జూరాల్లోని గింజల్ని తీసేసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో నెయ్యి వేసి ఖర్జూరాల్ని దోరగా వేయించుకోవాలి. చిన్న మంటపై ఖర్జూరాలు కొద్దిగా మెత్త పడేలా కలుపుతుండాలి. ఇప్పుడు కొద్దిగా పాలుపోసి మరోసారి కలుపుకోవాలి. ఈ మిశ్రమం చిక్కపడే వరకూ 20 నిమిషాలపాటు పొయ్యిపైనే ఉంచాలి. తర్వాత డ్రైఫ్రూట్స్ ముక్కలు మెత్తబడ్డాయో లేదో చూసి స్టౌపై నుండి దింపేయాలి. వేడి తగ్గాక ఈ మిశ్రమాన్ని ఒక ప్లేట్‌లోకి తీసి రెండు గంటలు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తర్వాత రోల్స్‌లా చుట్టుకుని కొబ్బరి పొడిలో అద్దాలి. చివరిగా వాల్‌నట్స్‌తో అలంకరిస్తే కమ్మని ఖర్జూర రోల్స్ రెడీ!



వేరుసెనగ కోవా

కావాల్సిన పదార్థాలు

వేరుసెనగలు-200 గ్రాములు
బెల్లం-1కప్పు
శొంఠిపొడి-1/4 స్పూన్
నూనె/నెయ్యి- 4 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

స్టౌపై బాణలి పెట్టి సన్నని సెగపై వేరుసెనగల్ని బాగా వేయించుకోవాలి. చల్లారాక పొట్టుతీసి మిక్సీ జార్‌లో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక బౌల్‌లో కొద్దిగా నెయ్యి, వేరుసెనగ పొడి తీసుకుని బాగాకలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక మందపాటి పాత్ర ఉంచి బెల్లం కొద్దిగా నీరు పోసి తీగ పాకం వచ్చే వరకూ కలుపుతుండాలి. ఇందులో వేరుసెనగ పొడి, శొంఠిపొడి వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి ప్లేట్‌లో కొద్దిగా నెయ్యి రాసి వేరుసెనగ పాకాన్ని పోయాలి. వేడిగా ఉన్నప్పుడే నచ్చిన ఆకృతిలో బిళ్లలుగా చేసుకుంటే వేరుసెనగ కోవా తయారయినట్టే.

బాల నేస్తాలు

ఏ నీడ ఎవరిది

ఇక్కడ కొంత మంది పిల్లలతో పాటు వారి నీడల్ని ఉంచాం. ఎవరి నీడ ఎక్కడుందో గుర్తించి జతచేయండి.

అతికించండి



కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ కుర్చీ కుడిపక్కకు తిరిగుంది. దీన్లో కొన్ని అగ్గిపుల్లల్ని





కదిలిస్తే ఈ కుర్చీ ఎడమవైపుకి మారుతుంది. అదెలాగో కనిపెట్టండి.

ఏమిటది?

నీటిలో పంట. ఆకుల్లేని పంట ఏమిటది?

జ: ఉప్పు

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో బాలివుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: రణబీర్ కపూర్

తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో మొత్తం ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



నేర్చుకుందాం

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ గబ్బిలం బొమ్మని గీసుంచాడు. జాగ్రత్తగా గమనించి మీరూ ప్రయత్నించండి.



హిమాలయన్ స్నోకాక్

పిల్లలూ! పేరును బట్టీ హిమాలయన్ స్నోకాక్‌లకి ఆ పేరు ఎందుకొచ్చిందో మీకు ఇప్పటికే అర్థమై ఉంటుంది. మీరు ఊహించినట్టుగానే ఈ పక్షులు హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపిస్తాయి. ఎత్తైన మంచు కొండల్లో జీవించడమే కాదు ఇవి కొన్ని ప్రత్యేక లక్షణాలనీ కలిగున్నాయి. అవేంటో తెలుసుకుందామా....

✧ ఈ పక్షుల ముఖ భాగం తెల్లటి మంచు పొరల్ని అద్దుకున్నట్టు ఉంటుంది.

✧ ఇవి 55 -73 సెంటిమీటర్ల పొడవు, 1-3 కేజీల బరువు కలిగుంటాయి.

✧ మగ పక్షులు ఆడవాటికంటే ఎక్కువ బరువుంటాయి.

✧ వీటి శరీరంపై భాగమంతా బూడిదరంగుపై గోధుమ రంగు మచ్చలతో ఆకర్షణీయంగా ఉంటుంది.

✧ ముఖం శరీర భాగం మధ్య ఒక బ్యాండ్ తొడిగినట్టు ఉండడంతో పాటు తెలుపు రంగులో పొరలు పొరలుగా ఉండే శరీరభాగం, పొడవైన మెడ, కాషాయ రంగులో కాళ్లు వీటికి మరో ప్రత్యేక ఆకర్షణ. వీటి రెక్కలు నలుపు గోధుమ రంగు కలగలుపుగా ఉంటాయి. తోక భాగం తెల్లగా ఉంటుంది.

✧ పదునైన ముక్కు కలిగిన స్నో కాక్‌లు ఆకులు, పళ్ళు, బెర్రీలు, చిన్న చిన్న పురుగుల్ని ఆహారంగా తీసుకుంటాయి.

✧ బరువైన శరీరం, గుండ్రటి రెక్కల్ని కలిగుండడంతో ఇవి ఎక్కువగా ఎగరలేవు.

✧ ఈ పక్షులు కొండవాలు ప్రాంతాల్లో పగటి పూట మాత్రమే నేలపై ఆహారాన్ని ఏరుకుంటుంటాయి.

✧ ఎప్పుడైనా ఎగారాలనుకుంటే ఇవి హిమాలయాల్లోని ఎత్తైన పర్వతంపై (శిఖరాగ్రం) భాగానికి చేరుకుని గాల్లోకి దూకుతాయి. తిరిగి నేలను చేరుకునేటప్పుడు గాలి వాటాన్ని బట్టీ వేగాన్ని తగ్గించుకుంటాయి.

✧ వసంత రుతువులో ఇవి ఈలలు, విచిత్రమైన శబ్దాల్ని చేస్తుంటాయి.

✧ ఎక్కువగా ఒంటరిగా ఉండేందుకే ఇవి ఇష్టపడుతుంటాయి.

✧ హిమాలయన్ చిరుతలు, గద్దలు స్నోకాక్‌లని వేటాడుతుండటాయి.

✧ గుడ్లు పొదిగే సమయంలో రక్షణ కోసం స్నోకాక్‌లు గుంపులుగా తిరుగుతుంటాయి. ✦

ప ద వి కా సం - 29

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. పార్లమెంట్ సంయుక్త సమావేశానికి అధ్యక్షుడెవరు (3)
3. దేవదాసు నవలా రచయిత (3)
7. నిందించు (2)
8. ఉపన్యాసం (3)
9. కోరిక (2)
13. తరగతి గదిలో సుద్దముక్కను దేనిపై రాస్తారు ? (4)
14. తెలుగు సంవత్సరాలలో నాల్గవది (4)
16. ఎద్దు చేసే ధ్వని (2)
17. ఆలీ, వేణుమాధవ్ హీరోలుగా నటించిన చిత్రం (3)
18. చివరలేని 'ఆదేశం' (2)
21. గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్న దెవరు (3)
22 ....మీద బ్రహ్మాస్త్రం అంటుంటారు (3)

■	1	2		■	3	4		■
5	■		■	6	■		■	■
7		■	8			■	9	10
	■	11			■	12	■	
13				■	14			
	■		■	15	■		■	
16		■	17			■	18	
■	■	19	■		■	20	■	
■	21			■	22			■

నిలువు

2. స్వప్నము (2)
4. నెత్తురు (2)
5. శాతవాహనుల తొలి రాజధాని (6)
6. రుచికరమైన (3)
10. కంప్యూటర్ మహిళగా పేరుగాంచిన భారతీయురాలు (6)
11. స్త్రీ అబల కాదు (3)
12. అంగీకారం (3)
15. ముందరి కాలు (3)
19. ప్రవాహంలో కొట్టుకొని వచ్చిన ఇసుక (2)
20. ముద్ర (2)

సుడోకు

		6				4	3	9
			7				1	2
2	8		3					7
6				1	2	7	4	
	9	4	6		7	1	2	
	1	2	8	3				5
8					3		5	1
9	2				8			
5	4	3				2		

గతవారం జవాబులు

1	7	2	4	5	6	9	8	3
9	5	6	7	3	8	1	4	2
3	8	4	9	2	1	5	6	7
4	9	1	3	6	5	2	7	8
6	2	5	8	1	7	3	9	4
8	3	7	2	9	4	6	5	1
7	1	9	5	4	3	8	2	6
2	4	3	6	8	9	7	1	5
5	6	8	1	7	2	4	3	9

1 చం	ద	2 మా	మ	■	3 కం	4 ట	క	5 ము
ద్ర	■	ట	■	6 క	■	క్కు	■	క్క
7 గి	ట్టు	■	8 తు	మ్మ	ల	■	9 పె	ద్ద
రి	■	10 ధ్యా	■	గ	■	11 క	■	ము
■	12 వ	న	ము	■	13 ప	ల	క	■
14 త	■	ము	■	15 బ	■	ము	■	16 మి
17 దు	క్కి	■	18 మ	రు	వం	■	19 ద	రి
ప	■	20 డ్డు	■	వు	■	21 శే	■	యు
22 రి	ప	దు	త	■	23 గ	జీ	త	ము


బహమాస్


థాయ్‌లాండ్

యూకే

శిలలపై కలలు చెక్కినారు

ఆస్ట్రేలియా

శిల్పమంటే శిలను అందంగా తీర్చిదిద్దినదేనా..? అందానికి ఆలోచన అద్దినదేనా..? అర్థం కానిదేదో కళ్లకద్దినట్టు చెప్పినదేనా..? ఇదే అయితే ఈ శిల్పాలన్నీ ఆ తరహావే. ప్రపంచవ్యాప్తంగా నగర వీధుల్లో, సముద్ర తీరాల్లో అర్థవంతంగా రూపుదిద్దుకున్న అద్భుత కళా శిలలివే. ఊహలకు, కలలకు కళను ఆసరా చేసుకుని కల్పించిన ఈ ఒక్కో శిల్పంలో ఎన్నో విషయాల్ని గమనించవచ్చు. ఎంతో సేపు సాలోచనగా చూస్తుండిపోవచ్చు.

ఫ్రాన్స్

ఐస్‌ల్యాండ్


అమెరికా


సింగపూర్


అమెరికా

పోలాండ్

సరస్సుల లోకం



క్రొయేషియాలో ఇది ప్లిట్‌విక్ సరస్సుల మాసం. అంటే మరో పన్నెండు మాసాల్లో ఒక దాని పేరని కాదు. ప్రకృతి తలంటు పోసుకునే కాలం. అంటే వర్షంలో తడిసిముద్దయ్యే కాలం అని కూడా కాదు. మంచు కరిగి నేల నలు చెరుగులా నీరు పొర్లాడుతుంది. తారాడుతుంది. ప్రపంచంలోనే అత్యద్భుతమైన సరస్సుల వ్యవస్థ ప్లిట్‌విక్. 16 ఎగుడు దిగుడు సరస్సుల్లో నీరు ఒక దాని నుంచి మరో దానిలోకి మారుతుంటుంది. పదుల అడుగుల నుంచి వంద మీటర్ల ఎత్తు వరకు దొంతరలుగా ఉండే ఈ సరస్సుల నుంచి జాలువారే ప్రవాహాలు వందల జలపాతాల్ని సృష్టిస్తాయి. ఎటూ చూసినా చెమ్మ కనిపిస్తూనే ఉంటుంది. ఎక్కడ విన్నా జల గళగళలు వినబడుతూనే ఉంటాయి. అక్టోబర్ మాసంలో జలసిరి ప్రకృతంతా పరుచుకుంటుంది. మధ్య క్రొయేషియాలోని కార్స్ పర్వత ప్రాంతంలో నెలవైన ఈ సరస్సుల ప్రకృతి ప్రాంతం విస్తీర్ణం 73,350 ఎకరాలు. జాతీయ పార్క్‌గా అభివృద్ధి చేసి పర్యాటకులను జల లోకంలోకి పదవల్లో తిప్పుతోంది క్రొయేషియా. ఇక్కడ కొస్జాక్ అతి పొడవైన సరస్సు (4 కి.మీ.). దీని నుంచే వెలికీ స్లాప్ అనే పదుల జలపాతాలుగా పడే ప్రాంతానికి బోట్‌లో తీసుకెళతారు.









Check List

Book Number	KNSR02B136	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameena	Pages	29